హాస్య 'పద్మం'

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

సెప్టెంబర్ 27, 2015

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

గండికోట రహస్యం



చాందినీ బార్

ముంబై చిత్రాలు

లైఫ్ ఇన్ మెట్రో

బాంబే బోయిస్

నగర జీవనం పైపైన పరిశీలిస్తే అర్థమయ్యే ఘటం కాదు. లోతుగా అధ్యయనం చేస్తేనే అందులోని భిన్న పార్శ్వాలు బోధపడతాయి. ఇలాంటి నగరాల్లో ముఖ్యమైనది ముంబై. ఇక్కడి ప్రజల జీవితాలను బాలీవుడ్ ఎప్పటికప్పుడు తెరకెక్కిస్తూనే వుంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్'తో మొదలెడితే 'బాంబే బోయిస్' వరకూ ఎన్నో సినిమాలు ముంబై నగరాన్ని పలు కోణాల్లో ప్రేక్షకుల ముందుంచాయి. డేనీ బోయ్లేకు ఆస్కార్ అందించిన చిత్రం 'స్లమ్ డాగ్ మిలియనీర్'. ముంబైలో నిష్ట దరిద్రం తాండవించే మురికివాడను కేంద్రంగా చేసుకుని తీసిన చిత్రమిది. 2008లో ముంబై నగరాన్ని వణికించిన వరుస బాంబు పేలుళ్లపై వచ్చిన సినిమా 'ముంబై మేరీ జాన్'. స్థానికేతరులైనా సరే సినిమా చూసేటప్పుడు కన్నీరు పెట్టాల్సిందే. మధుర్ భండార్కర్ 'చాందినీ బార్' ముంబైలోని బార్ డాన్సర్ జీవితాన్ని తెరకెక్కించింది. బార్ డాన్సర్ల కష్టాలు... వారిపై ఆధారపడిన కుటుంబాల నిస్సహాయత...అన్నీ కళ్లకు కడతాయి. నిత్యం రద్దీగా వుండే ముంబై వీధుల్లో కనిపించే యాచకుల జీవితాల్లోని కఠోర వాస్తవాలకు చిత్రరూపమే 'ట్రాఫిక్ సిగ్నల్'. ముంబైలో విభిన్న తరగతులకు చెందిన ప్రేమికుల కథలతో అల్లుకున్న చిత్రం 'లైఫ్ ఇన్ మెట్రో'. అచ్చమైన ప్రేమకథా చిత్రం 'బాంబే'. భిన్న మతాలకు చెందిన ఓ అమ్మాయి ఒక అబ్బాయి మధ్య ప్రేమ, పెళ్లి, పిల్లలు, మత ఘర్షణల సమయంలో చిన్నారులు తప్పిపోవడం...ప్రేక్షకులను కదలనివ్వకుండా కూర్చోబెట్టేస్తుంది. డ్రగ్ మాఫియా చుట్టూ అల్లిన కథ 'సలాం బాంబే'. ముగ్గురు ఎన్నారై అబ్బాయిలు కలిసి ఒక ఫ్లాట్ పంచుకోవడాన్ని హాస్యరస ప్రధానంగా తెరకెక్కించిన సినిమా 'బాంబే బోయిస్'. బాంబే నగరం ముంబైగా మారక ముందు తీసినదీ చిత్రం. మొత్తంమీద ఇవన్నీ ప్రేక్షకులను ఆకట్టుకున్నవే. ●

ట్రాఫిక్ సిగ్నల్

సలాం బాంబే

బాంబే

స్లమ్ డాగ్ మిలియనీర్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

డాక్టర్ బంట్రోతు!

రికార్డులు సృష్టించడంలో...వాటిని తిరిగి బద్దలు కొట్టడంలో ... మన నాయకమ్మన్యుల్ని కొట్టేవాళ్లు లేరు. ఇంతకీ ఏ విషయంలో అంటే...! నిరుద్యోగం, నిరక్షరాస్యత, నిష్ట దరిద్రం...లాంటి భారీ అంశాల్లో. కాకలుతీరిన ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలకు సైతం మింగుడు పడని సదరు అంశాల్లో రికార్డుల మీద రికార్డులు తిరగరాయడం అంత సులభం కాదు. దానికి బోలెడంత నైపుణ్యం కావాలి. అది మన పాలకులకు పుష్కలంగా వుందని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూనే వున్నారు.

నిన్న కాక మొన్న ... సచివాలయంలో పని చేయడానికి 368 మంది బంట్రోతులు కావాలంటూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ చిరు ప్రకటన ఇచ్చింది. దానికే దరఖాస్తుల కుంభవృష్టి కురిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి 23 లక్షల మంది పోటీ పడ్డారు. దరఖాస్తుల వెల్లువ చూసిన అధికారులు బెంబేలెత్తిపోయారంటే నమ్మశక్యం కాదు. మౌఖిక ఇంటర్వ్యూలు రోజంతా (24 గంటలూ) చేసినా ప్రక్రియ ముగిసే సరికి నాలుగున్నరేళ్లు పడుతుందట. ఆ సమస్య నుంచి బైటపడేదెలాగబ్బా అని బుర్రలు బద్దలు కొట్టుకున్న అధికార గణానికి ఓ ఆలోచన వచ్చింది. దాని ప్రకారం దరఖాస్తుదారులకు రాత పరీక్ష పెట్టాలని నిర్ణయించుకున్నారు. అయినప్పటికీ వారికిది పెద్ద తలనొప్పిగానే తయారైంది. మరి బంట్రోతు ఉద్యోగార్థి అయిదవ తరగతి పాసై... సైకిల్ తొక్కగలగితే చాలు. ఊహించనివిధంగా... గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్లు దరఖాస్తులు పెట్టేయడంతో అసలు వీళ్లు పోటీ పడుతోంది బంట్రోతు ఉద్యోగానికేనా అన్న అనుమానం వచ్చిందట. అయినా అక్కడనేముంది!? చత్తీస్‌గఢ్‌లోనూ బంట్రోతు ఉద్యోగాలకు ఇలాగే ఎగబడ్డారు. తెలుగు తమ్ముళ్లూ తక్కువ కాదు. విఆర్‌ఒ ఉద్యోగాలకోసం ఎంత పోటీ పడ్డారో మర్చిపోతామా!

◆ మనలో మాట

ఏడాది ముగిసే సరికి లక్షలాది మంది పట్టభద్రులు బైటికి రావడం...నిరుద్యోగ సైన్యంలో చేరిపోవడానికే వున్నట్లుంది పరిస్థితి. చేతిలో పట్టాలున్నా తగ్గ పని చేయగలవారు అంతంత మాత్రమే. వానాకాలపు చదువులతో, భాషా నైపుణ్యాల లేమితో వారు మాత్రం అంతకుమించి ఏం చేస్తారు? అన్నిటినీ మించి బంట్రోతు ఉద్యోగమే అయినా కోతలు పోను నెలకు పదహారు వేల రూపాయల జీతం చేతికందుతుంది. పరిమిత పనిగంటల్లో చేసినా చేయకున్నా అడిగే దిక్కుండదు. ఉద్యోగం ఊడుతుందన్న బెంగ అంతకన్నా వుండదు. ఇంకేం కావాలి! అందుకే డాక్టరేట్లున్నా ప్యూన్ ఉద్యోగాలకు ఎగబడిపోతున్నారు. మోడీ సాబ్ 'నైపుణ్య భారత్' అంటూ ఉత్తుత్తి నినాదాలిస్తే సరిపోదు. యువత నైపుణ్యాలు పెంచేందుకు గట్టిగా ప్రయత్నించాలి. అప్పుడే పట్టాలకు తగ్గ పనులు ఎంచుకుని చేయగలుగుతారు. ఏమంటారు! ■

ఈ సంచికలో....

గండికోట రహస్యం

కవర్ స్టోరీ —— 14

ఆహ్లాదకరమైన వాతావరణం. పక్షుల కిలకిలారావాలు. చుట్టూ ఎత్తైన కొండలు. ఆ కొండల మీద ప్రకృతి మాత పచ్చని చీర కట్టి మనల్ని ఆహ్వానిస్తున్నదా అన్నట్టుండే రమణీయ సోయగాలు. ఇన్నిటి మధ్య అలనాటి వీర చరితకు, గత కాలపు మధురస్మృతులకు మౌనసాక్షిగా గంభీరంగా దర్శనమిచ్చే కట్టడం గండికోట! ఎంత చూసినా... ఎన్ని సార్లు దర్శించినా... తనివి తీరని ఈ కోటను ఒక్కసారి చూస్తే చాలు! అలనాటి రాజుల వీరత్వం, యుద్ధాలు, పరిపాలన మన ముందు బ్లాక్ అండ్ వైట్ సినిమాలా దర్శనిమిస్తుంది.



స్ఫూర్తి 3
మనసున్న మనిషి

ప్రత్యేకం 4
'గాంధీ' టీచర్

కార్టూన్ పంచ్ 5

సేవ 10
అపితో దక్షిణ చిప్కో..

నవ్వుల్ పువ్వుల్ 11

సినిమా కబుర్లు 14
హాస్య'పద్మం'

వింత లోకం 16
కొండంత బరువెత్తి..

రుచి 17
ఆలూతో ఆహా !

కథ 18
బాలయ్య కోపం

బాలనేస్తాలు 22
పులి తల్లి పంది పిల్లలు

రుచి 24
ఆలు ఫ్లవర్



చూద్దామా -12
నేటి ఐన్‌స్టీన్లు... పొత్తర్లు..



టపా

గుర్తు చేశారు

గ్రామసీమ కాలమాగితే, సంగీత సామ్రాజ్ఞి, నాగయ్య కాదు త్యాగయ్య అంశాలు మమ్మల్ని ఎంతగానో అబ్బురపరిచాయి. చేతివృత్తుల కళాకారులు తాము చేసిన అపురూపమైన వస్తువులు కనుమరుగవుతున్న సమయంలో వాటిని మరోసారి గుర్తుకు తెచ్చారు.

నాగరాజు, ప్రకాశ్ రోడ్డు, అనంతపురం

ప్రశ్నను చంపలేరు

ఒకే తల్లి కడుపున పుట్టిన శైలేంద్ర, సుష్మ వర్మ, అనన్య ఈ ముగ్గురూ పిన్న వయస్సులోనే పెద్దల చదువు పూర్తి చేయడం సాధ్యమని రుజువు చేయడం నిజంగా గర్వకారణం. నాటి ఇతిహాసం నుండి నేటి ఆధునిక కాలం వరకు కూడ ప్రజల కోసం ప్రశ్నించే వారిని చంపుతున్నారు గాని "ప్రశ్నను చంపడం" వాళ్లకి సాధ్యం కాలేదు. వ్యాసాన్ని చాలా చక్కగా వివరించారు. పాత్రను మెప్పించడంలో నాగయ్య తనకు తానే సాటి. శరతు కథలో మల్లన్న నేటి తరం కుర్రాడిగా కనిపించాడు. మహిళల మరుగుదొడ్లకు పురుషులు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఈ వ్యవస్థ లోపంగా చూపించడం చాలా బాగుంది.

ఇలిపిళ్ల సూర్యనారాయణ, భీమనవారిపేట, విజయవాడ

శరతు బావుంది

కన్నడ హేతువాది కల్బుర్గి హత్యోదంతంపై ఇచ్చిన కవర్ స్టోరి 'ప్రశ్నను చంపగలరా' చదువుతుంటే సమాజం యెక్కడికి పోతోందో అర్థం కావటం లేదు. వ్యక్తులను చంపగలరేమో గానీ శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని చంపగలరా...!! చాలా మంచి వ్యాసం ప్రచురించారు. నాగయ్య కాదు త్యాగయ్య ద్వారా ఆ మహనీయుని దాతృత్వం గురించి తెలుసుకున్నాం. ప్రముఖ గాయని ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి గురించి వచ్చిన ఆర్టికల్ ఎన్నో విషయాలను తెలియపరిచింది. కథ శరతు బాగుంది. జీవించడమంటే ప్రవహించడమే కత్తి పద్మారావు కవిత చాలా బాగుంది. కార్టూన్లు, జోక్స్ అలరించాయి.

కైపు ఆదిశేషా రెడ్డి, నెల్లూరు

గొప్ప త్యాగి

తెలుగు జాతి గర్వించదగ్గ చిత్తూరు నాగయ్య సినీ చిత్ర సీమలో మహోన్నతమైన పాత్రల్ని పోషించాడని తెలుసుకున్నాం. ఆయన గురించి తెలియని ఎన్నో విషయాలను సినిమా కబుర్లు'లో తెలుసుకున్నాం. ఆనాటి మహానుభావుడి గురించి తెలియజేసినందుకు సంతోషం.

శెట్టివారి జగన్ మోహన్, సోమల, చిత్తూరు

అన్నీ తానై...

మనిషి జీవితంతో ప్రకృతి ఒక భాగం అని చెప్పడానికి పెళ్లి..పండగ.. అన్నీ సంద్రంలోనే అనే వ్యాసం చక్కని ఉదాహరణ. నేటి సమాజంలో ప్రశ్నించే తత్వం రోజు రోజుకు దిగజారుతోంది. ఈ తరుణంలో మంచి వ్యాసాన్ని అందించారు. తన కూతురు కోసం పడే వేదనను రంగుల పేజీలో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. వయెలెట్ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. ఈ వారం కలర్ పేజీలు, కార్టూన్స్, జోకులు అన్నీ బాగున్నాయి. చిత్తూరు నాగయ్య గొప్ప నటుడి గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం.

రాము, ఖాజీపేట, కడప

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ముంబై మహా నగరంలో ఎవరికి వారు నిత్యం బిజీనే. ఎవరి గురించి మరెవరూ ఆలోచించగలిగేంత తీరిక ఓపిక లేనంత ఉరుకులు పరుగుల జీవితాలవి. అలాంటి చోట ఓ యువకుడు నడి రోడ్డు మీద నిలబడి ఆలోచించాడు. బాధితులకు... అందునా క్యాన్సర్ మహమ్మారి బారిన పడిన వారికి ఏదో విధంగా సాయం చేయాల నుకున్నాడు. టాటా క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా వున్న ఫుట్ పాత్‌నే తన అడ్డాగా మలచు కున్నాడు. ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు ఉచితంగా భోజనం అందించ సాగాడు.

మనసున్న మనిషి

ఆ యువకుడే హరక్‌చంద్ సావ్లా. అప్పుడతనికి సరిగ్గా మూడు పదుల వయసు వుంటుందేమో. హోటల్ నడుపుతుండేవాడు. ఎక్కడెక్కడో మారు మూల గ్రామాలు మొదలుకొని నగరాల్లోని మురికివాడల నుంచి ముంబై నగరం వచ్చి అష్టకష్టాలు పడే పేద క్యాన్సర్ రోగులను చూసి ఆలోచనలో పడ్డాడు. తమకున్న కొద్దిపాటి విలువైన వస్తువులు, పొలం, పుట్ర అమ్ముకుని భాషగాని భాష, ఊరు కాని ఊరు వచ్చి ... ఆఖరికి మాట సాయం చేసే దిక్కులేక ... వారు పడే ఇబ్బందులను చూసి చలించిపోయాడు. వారికి సాయపడాలనుకున్నాడు. అందుకోసం లాభసాటిగా నడిచే తన హోటల్‌ను అద్దెకు ఇచ్చేశాడు. వచ్చిన పైకంతో ఆస్పత్రి ఎదురుగానే మకాం వేశాడు. రోగులకు అవసరమైన ఆహారం అందించడం మొదలెట్టాడు. మంచి పని చేసే తీరిక లేకున్నా మనసున్న వారు తమ వంతు చెయ్యడానికి ముందుకొచ్చారు. ఆర్థికంగా మరికొంత వెసులుబాటు కలగడంతో 'జీవన జ్యోతి' ట్రస్టును ప్రారభించి మరింత మందికి అన్నం పెట్టసాగాడు. దాతలు ఎవరైనా సరే నగదు రూపేణా సాయం చేయలేకపోయినా ఇళ్లల్లో మిగిలిపోయిన మందులు, పాత దుస్తులు, బొమ్మలు, పుస్తకాలు ఇచ్చినా ఆనందంగా స్వీకరించసాగారు.

ముప్పై ఏళ్లుగా అదే సేవాతత్పరత

మూడు దశాబ్దాల తర్వాత ... యాభై ఏడేళ్ల వయసులో కూడా అతనిలో ఇప్పటికీ అదే స్ఫూర్తి, సేవా తత్పరతతో క్యాన్సర్ రోగులకు, వారి బంధువులకు పౌష్టికాహారాన్ని అందిస్తూనే వున్నాడు. ప్రస్తుతం ముంబై నగరంలోని నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులలో 750 మంది రోగులకు భోజన భాగ్యం కలిగిస్తున్నాడు. మధ్యాహ్నం 12.30 గంటలకు, రాత్రి 6.30 గంటలకు పొగలు కక్కే కిచిడీ, అన్నం, కూరలు, ఉడికించిన కూరగాయలు అందిస్తారు. క్యాన్సర్ సోకిన చిన్నారులను మరింత ప్రేమగా అక్కున చేర్చుకుంటారు సావ్లా. వీరికి ఉచితంగా బొమ్మలు, పుస్తకాలు, బట్టలు, మందులు అందిస్తారు. పసి హృదయాలు బాధను మర్చిపోవడానికి ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తారు. కీమో థెరఫీ తీసుకునే రోగులు, గొంతు క్యాన్సర్‌తో బాధపడే వారు ఉప్పుకారాలతో కూడిన ఆహారాన్ని తీసుకోలేరు కనక పసుపు వేసి కాచిన పాలు అందిస్తారు. 'జీవన జ్యోతి' ద్వారా రక్తదాన కార్యక్రమం నడుపుతున్నాడు సావ్లా. స్వయంగా తాను కూడా ముప్పై ఏళ్లలో 102 సార్లు రక్తదానం చేశాడు. రోగులు, వారి బంధువులు అడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా చిరునవ్వుతో సమాధానాలు ఇవ్వడమే కాక అవసరమైన సాయం కూడా చేస్తారు.

అలా మొదలైంది

ఓసారి సావ్లా దగ్గరకు ఓ యువతి రొమ్ము క్యాన్సర్ సోకిన తన తల్లితో కలిసి వచ్చింది. వారిది ఏదో మారుమూల పల్లె. తల్లికి వైద్యం చేయించాలి. అతన్ని సాయమడిగింది. తనకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో ఆ ఇద్దరిని సియోన్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఉచితంగానే చికిత్స అందినప్పటికీ ఏ చిన్న పరీక్ష చేయించుకోవాల్సి వచ్చినా టాటా మెమోరియల్ ఆస్పత్రికి రావాల్సి వచ్చేది. ఆ క్రమంలో అతనికి ఓ విషయం తెలిసింది. టాటాలో సైతం జనరల్ విభాగంలో ఉచితంగా వైద్యం చేసే సౌకర్యం వుందని (డబ్బు కట్టగలిగేవారికి ప్రయివేటు విభాగంలో చికిత్స చేస్తారు). అప్పుడు అతను ఎంతగానో పశ్చాత్తాప పడ్డాడు. తనకా విషయం తెలియక పోవడం వల్లనే వారిని రెండు ఆస్పత్రులకు తిప్పవలసి వచ్చిందని బాధ పడ్డాడు. అప్పుడే అతనికో ఆలోచన వచ్చింది. ఎటువంటి సమాచారం తెలీకుండా ముంబై వచ్చే రోగులకు సాయం చేయాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాడు. అయితే అతనికి భార్య ఇచ్చిన అండదండలు అంతా ఇంతా కావు. నగలు, ఖరీదైన చీరలు అడిగేది కాదు ఆవిడ కూడా. తమకు వున్న దాంట్లో పేదలకు సాయం చేయడం కన్నా తనకేమీ అవసరం లేదని భర్త ఆదర్శంలోనూ అర్ధ భాగమైంది. సావ్లా తండ్రి కూడా కొడుకుని సరైన మార్గంలో నడిపే మాటలే చెప్పాడు. 'ఈ పనిని నువ్వు ముందు ముందు కూడా కొనసాగించా లంటే... ఎటువంటి విలాసాల జోలికి వెళ్లకు. బస్సుల్లోనే ప్రయాణం చెయ్యి' అన్నాడు. ఆ మాటలను మనసులో నింపుకుని ఆ మార్గంలోనే నడుస్తున్నాడు సావ్లా. ప్రస్తుతం ఆ ట్రస్టు కింద పని చేస్తున్న 150 మంది వలంటీర్లు అదే సంకల్పంతో పనిచేస్తున్నారు.





'గాంధీ' టీచర్

కర్నాటకలోని కాడూరులో గాంధీ తిరుగుతున్నాడు. వీధులు, మార్కెట్లు, గుళ్లు, బడులు ఎక్కడైనా మంచి మాటను పదుగురికి పంచుతుంటాడు. గాంధీ వేషం కట్టి దారిన ఎదురొచ్చి మంచి బాటన నడిపించే ప్రయత్నం చేస్తుంటాడు. గాంధీని గుర్తుచేసుకోవడానికి అక్టోబర్ 2, జనవరి 30 వరకో వేచి చూసే నైజం కాదీ మాజీ మాస్టారిది. ప్రతి రోజు గాంధీ మాటను, బాటను తోటివారికి గుర్తెరిగేలా చేసే బాధ్యతను భుజానేసుకున్న సంకల్పమీ ప్రస్తుత ఇన్సూరెన్స్ ఏజెంట్‌ది.

గాంధీ జయంతి నాడో, వర్ధంతి నాడో గాంధీని గుర్తుచేసుకునే తరానికి చేరుకుంది కాలం. చేతిలోని నోటుపైన బొమ్మ ఉన్నా సందేశం పట్టకుండా తిరుగుతున్న సమాజంలో గాంధీని సరిగ్గా గుర్తుపట్టడానికి వేషం కట్టాడు పొరుగు రాష్ట్రానికి చెందిన బగదహళ్లి బసవరాజు. ఒంటికి వెండి రంగు పూసుకుని గాంధీ వేషమేసే బసవరాజు కాడూరులో అందరి మనిషి. ఇక్కడ కూడా చాలా మంది అలా వేషం కట్టి వీధుల్లో బిచ్చమెత్తుకోవడం చూస్తూ ఉంటాం. కానీ బసవరాజు అలా కాదు. గాంధీగా ప్రేమగా ఊరి వాళ్లు పిలవడానికి కారణం మరోటి ఉంది.

చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా...

బసవరాజు 14 ఏళ్లపాటు పీఈటీగా పనిచేశారు. వృత్తిలో భాగంగా బడి పిల్లలకు శారీరక కసరత్తులు, ఆటలు నేర్పుతుండేవారు. అలాగే దేశభక్తిని ఆ చిరు హృదయాల్లో వెలిగిస్తుండేవారు. మిగతా ఉపాధ్యాయుల్లా కేవలం మహాత్ముల మాటల్ని, విషయాల్ని, జీవిత పోరాటాల్ని నల్ల బోర్డు మీదో, గంటల ఉపన్యాసంతోనో కాక వినూత్నంగా పాఠాలు పట్టించేవాడు. తాను వివరించబోయే మహాత్ముడిని పోలే వేషంతో బడికి చేరుకునేవాడు. వారి హావభావాలతో విశేషాల్ని చెబుతుంటే విద్యార్థులు చాలా ఆసక్తిగా వినేవారు. తేలిగ్గా అర్థం చేసుకునేవారు. బసవరాజు మాస్టారి తరగతి కోసం పిల్లలు ఎదురుచూసేవారు. నేర్చుకున్న విషయాల్ని ఇంటికెళ్లి తల్లిదండ్రులతో పంచుకోందే వారికి నిద్ర పట్టేది కాదు. అంత అద్భుతంగా జాతీయ నేతల జీవిత చరిత్రలను చిన్ని బుర్రలకు ఇష్టంగా మార్చేసేవాడు. ఇలా 82 మంది జాతీయ నేతల వేషాలు కట్టి వారి జీవిత విశేషాల్ని వివరించాడు. వీరిలో గాంధీ, బోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య యోధుల నుంచి దా.రా. బింద్రే వంటి కన్నడ అభ్యుదయ రచయితలు, సంగొల్లి రాయన్న వంటి ఆదర్శరైతుల వరకు ఉన్నారు. కేవలం మంచి మాటల్ని చెప్పడమే కాకుండా తన జీవితంలోను వాటిని పాటించేవాడు. అందులో చాలా ముఖ్యమైన విషయం వివాహానికి సంబంధించింది. బసవరాజు వరకట్నానికి వ్యతిరేకంగా ఎన్నో ప్రదర్శనలిచ్చారు. అలాగే తాను కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నారు. అదీ ఓ బధిర మహిళను. ఇది ఆదర్శ వివాహం అని అందరూ అన్నా ... అద్భుత వ్యక్తిత్వం ఉన్న మహిళను చేసుకోవడం తన అదృష్టంగా భావిస్తారు. అయితే ఇలా కొత్త విధానంలో పిల్లలకు పాఠాలు చెప్పడానికి కాస్ట్యూమ్స్, మేకప్పులకు చాలా ఖర్చు అయ్యేది. అదీ తన జీతంలోనే చూసుకునేవారు. ప్రైవేట్ స్కూల్లో పనిచేసిన ఆయనకు 100 ఇంక్రిమెంట్ ఏ మాత్రం సరిపోక, ఏడు వేల జీతంతో నెట్టుకురాలేక సతమతం అయ్యేవారు. రాను రాను కుటుంబ భారం ఎక్కువ కావడంతో సంపాదన కోసం టీచర్ ఉద్యోగం మానేశారు. ఇన్సూరెన్స్ ఏజెంట్ వృత్తిని ఎంచుకున్న ఆయన బడికి మాత్రం దూరం కాలేదు. ఒకప్పుడు తాను పనిచేసే పాఠశాలకే ఆయన సేవలు పరిమితం అయితే కొత్త వెసులుబాటు ద్వారా మిగతా బడులకూ వెళ్లి ప్రదర్శనలు, ప్రసంగాలు ఇవ్వగలుగుతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఎప్పటి నుంచో ఆయన ప్రత్యేక బోధనా విధానం గురించి తెలిసిన మిగతా పాఠశాలలు ఆయనను ఇప్పుడు అతిథి ఉపన్యాసమివ్వాలని కోరుతున్నాయి. అడిగిన ప్రతి తరగతిని సందర్శించి జాతీయ నేతల విశేషాలు కళ్లకుకడుతూ విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నారు. అలా కాడూర్ అంతటా బసవరాజు మాస్టారి గురించి తెలిసి అందరూ గాంధీ అని పిలవడం ప్రారంభించారు. ఇప్పుడా ఊరంతా ఉన్న ప్రతి పాఠశాల విద్యార్థికి గురువయ్యే అరుదైన అవకాశాన్ని పొందినందుకు చాలా సంతృప్తిగా ఉందని అంటుంటారు.

అడిగి మరీ వేషం వెయ్యమంటారు

మహాత్ముల జీవిత చరిత్రలు పాఠ్యాంశాలుగానే పరిమితం కాకుండా జనసామాన్యంలోను ప్రచారమవ్వాలని జనసమ్మర్ద ప్రాంతాల్లో గాంధీ వేషంతో తిరుగుతుంటారు. ఆసక్తి కనపరిచిన వారికి మహాత్ముల గురించి కొన్ని విశేషాల్ని వివరిస్తారు. ఇలా చేస్తున్నందుకు కొందరు నవ్వుకుంటారు, కొందరు ఆటపట్టిస్తారు, కొందరు పిచ్చేమో అనుకుంటారు. ఎవరేం అనుకున్నా తన ప్రయత్నం ఆపడంలేదు. ఎందుకంటే కొందరు విద్యార్థులు కూడలిలో నిలుచున్న ఆయన దగ్గరకు వచ్చి ఇలా అడుగుతుంటారు.. "అప్పుడు మా క్లాస్‌లో గాంధీ గారి గురించి చెప్పారు కదా.. మొన్న క్లాస్‌లో భగత్ సింగ్ గురించి పాఠం వచ్చింది. మీరు ఆయన గురించి చెబితే ఇంకా బాగుంటుంది. ఆయన ఎలా ఉంటారో చూడాలనుంది. ఆ వేషం కట్టి మళ్లీ మా స్కూల్‌కు వస్తారా" అని. బసవరాజు మాస్టారి ప్రయత్నం విజయవంతమైందని ఇంతకన్నా ఎలా చెప్పగలం, అదే చూపగలం. ✦



కార్టూన్ పంచ్

మోడీ సాబ్ గ్రేట్ హై!, అద్భుత్ హై! బహుత్ అచ్ఛా హై!!
మన్‌కీ బాత్
సింగపూర్
ప్లీజ్... ఇన్వెస్ట్!!
మేక్ ఇన్ ఇండియా
సింగపూర్
పట్టిసీమ ప్రాజెక్ట్
ప్రజాధనం



గండికోట రహస్యం

ఆహ్లాదకరమైన వాతావరణం. పక్షుల కిలకిలారావాలు. చుట్టూ ఎత్తైన కొండలు. ఆ కొండల మీద ప్రకృతి మాత పచ్చని చీర కట్టి మనల్ని ఆహ్వానిస్తున్నదా అన్నట్టుండే రమణీయ సోయగాలు. ఇన్నిటి మధ్య అలనాటి వీర చరితకు, గత కాలపు మధురస్మృతులకు మౌనసాక్షిగా గంభీరంగా దర్శనమిచ్చే కట్టడం గండికోట! ఎంత చూసినా... ఎన్ని సార్లు దర్శించినా... తనివి తీరని ఈ కోటను ఒక్కసారి చూస్తే చాలు! అలనాటి రాజుల వీరత్వం, యుద్ధాలు, పరిపాలన మన ముందు బ్లాక్ అండ్ వైట్ సినిమాలా దర్శనిమిస్తాయి. చరిత్ర పరిణామ క్రమంలో గండికోట ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నప్పటికీ తడబడకుండా ... తనలో ఇముడ్చుకున్న అనేక చారిత్రక విశేషాలను, విజ్ఞానాన్ని భావితరాల వారికి అందిస్తూ ఒక చారిత్రక విజ్ఞాన సర్వస్వంగా భాసిల్లుతోంది. ఈ నెల 26, 27 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గండికోట వారసత్వ ఉత్సవాల సందర్భంగా ఇంతటి ఘన చరిత్ర కలిగిన కట్టడం గురించి తెలుసుకుందాం.

- పుత్రా పెద్ద ఓబులేసు
సెల్ 955029047

రాయలసీమ ప్రాంతం.. కడప జిల్లా ...జమ్మలమడుగు పట్టణం సమీపానున్న గండికోట గొప్ప చారిత్రక కట్టడం. విజయనగర రాజుల ఆయువు పట్టు గండికోట. కాకతీయ, కుతుబ్ షాహి పాలనాకాలంలోనూ దీనికి ప్రత్యేక స్థానం వుంది. కడప నుంచి 77 కి.మీ దూరంలో వుంది. కోటలో మాధవరాయ స్వామి ఆలయం, రఘునాథ దేవాలయం, మసీదు, ధాన్యాగారం, కారాగారం, కావలి మండపం, చెక్కు చెదరని గండికోట గోడ, నీటి కొలను గత చరిత్రకు సాక్ష్యాలుగా వున్నాయి. రఘునాథ, మాధవరాయ ఆలయంలో వున్న శిల్ప వైభవం పేర్కొనదగింది. కోటకు చేరుకునేందుకు కడప, జమ్మలమడుగు నుంచి బస్సు సౌకర్యం వుంది. అక్కడి నుంచి ఆటోల్లో ప్రయాణించి గండికోట చేరుకోవాలి. సందర్శకులు తాగునీరు, తినుబండారాలు వెంట తీసుకెళ్లాలి. ఔత్సాహికులు ఈ మధ్య అక్కడ ట్రెకింగ్, క్యాంపింగ్ కూడా చేస్తున్నారు.

అద్వితీయం గండికోట చరితం

గండికోటకు పడమర - ఉత్తర దిక్కుల్లో పెన్నా నది ప్రవాహం వల్ల కొండల్లో 8 కి.మీ. మేర వరకు లోతైన గండి(లోయ) ఏర్పడింది. అందువల్ల దీనికి గండికోట అనే పేరు వచ్చింది. ఎందరో చరిత్రకారుల ప్రశంసలు పొందిన గండికోట, పునాదులు లేకుండానే, కొండబండలపై నిర్మించబడడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. వివిధ రాజవంశాల పరిపాలనా కాలంలో గండికోట ఉచ్ఛస్థితిని మనం వివిధ శాసనాలు, కైఫీయత్‌ల ద్వారా



ధాన్యాగారం

తెలుసుకోవచ్చు. కళ్యాణీ చాళుక్య మహారాజైన త్రైలోక్యమల్లుడికి సామంతరాజుగా ఉండిన కాకరాజు క్రీ.శ. 1123లో గండికోటను నిర్మించినట్లు గండికోట దుర్గం కైఫీయత్ తెలుపుతోంది. కాయస్థ అంబదేవుడు తన రాజధానిని వల్లూరి నుండి గండికోటకు మార్చినట్లు క్రీ.శ.1290 నాటి త్రిపురాంతకం శాసనం తెలుపుతోంది. గండికోటను ఖండికోట మనోరథపురంగా ఈ శాసనం వర్ణిస్తోంది. కాకతీయ ప్రతాపరుద్రుని సేనాధిపతి కాయస్థరాజులలో చివరివాడైన రెండవ త్రిపురారి దేవుడిని ఓడించి కొంతకాలం గండికోటను పాలించాడు. అనంతరం విజయనగర రాజుల పరిపాలనా కాలంలో గండికోట పాలన ఆ రాజ్య పరిధిలోనే సాగింది. ఆ రోజుల్లో ముల్కినాడు, రేనాడు సీమలకు గండికోట పాలనా కేంద్రంగా ఉండేది. మొదటి బుక్కరాయల కాలంలో ఎల్లమర సామాత్యుడు గండికోట పాలకునిగానూ, పెమ్మసాని కుమార తిమ్మనాయుడు సైనికాధిపతిగా వ్యవహరిస్తూ అనేక యుద్ధాల్లో విజయాలు సాధించారు. రెండవ దేవరాయలు కాలం నుండి గండికోటపై పెమ్మసాని వారి ఆధిపత్యం పెరిగింది. రెండవ దేవరాయల వారి దగ్గర కుమార తిమ్మనాయుని కుమారుడు ధర్మనాయుడు సైనికాధిపతిగా సేవలందించారు. ఆ విధంగా పెమ్మసాని పాలకులు మూడు శతాబ్దాలకుపైగా గండికోటకు అధిపతులుగా వ్యవహరించారు. గండికోట చరిత్రలో పెమ్మసాని వారిదే ప్రధాన భూమిక. అనంతరం గండికోట గోల్కొండ నవాబుల పాలనలోకి వెళ్ళింది. నేక్‌నామ్ ఖాన్ కాలంలో జుల్ఫికర్ బురుజు, పత్తే దర్వాజాలతో కలిపి మొత్తం 24 బురుజులను నిర్మించాడు. ఆ విధంగా 1687 వరకు గండికోట కుతుబ్ షాహీల పాలనలోనే ఉంది. అనంతరం మైసూర్ పాలకులైన హైదర్ అలీ, అతని కుమారుడు టిప్పు సుల్తాన్ ఆధీనంలోకి వెళ్ళింది గండికోట. 1791లో టిప్పు ఆంగ్లేయుల చేతిలో ఓటమి పాలయ్యాక గండికోట కెప్టెన్ లిటల్ ఆధీనంలోకి వెళ్ళింది. ఆంగ్లేయుల పాలనా కాలంలో గండికోట ప్రాభవం పూర్తిగా తగ్గిపోయింది. ఆంగ్లేయులు కోటలోని ఫిరంగులను కరిగించి, ఇనుముగా మార్చి ఇంగ్లండ్‌కు తరలించారన్న కథనాలు ప్రచారంలో వున్నాయి. ఇక గండికోట విస్తీర్ణాన్ని మనం గమనిస్తే తూర్పు నుండి పడమర వరకు 1200 మీటర్ల పొడవు, 800 మీటర్ల వెడల్పుతో సుదీర్ఘ వైశాల్యంతో సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఎత్తైన కోట గోడ చుట్టూ మొత్తం 101 బురుజులు ఉన్నాయి. ప్రధాన ప్రవేశ ద్వారం ఎత్తు 20 అడుగులు వుంటుంది. చరిత్రలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న గండికోట, నేటికీ ఠీవిగా తన చారిత్రక వారసత్వాన్ని భావి తరాలకు అందిస్తూ వేనోళ్ళ ప్రశంసలు పొందుతోంది.

రాయలసీమ సామాజిక, సాంస్కృతిక వారధి

గండికోటలో హిందూ – ముస్లిం రాజుల పాలన కొనసాగడంతో, హిందూ – ముస్లిం సంస్కృతికి ప్రతీకగా నిలిచింది. నేటికీ కోటలో ఒకవైపు హిందూ దేవాలయాలు, మరోవైపు మసీదులు ఉండడంతో, హిందూ – ముస్లిమ్‌లు ఇరువురూ కూడా గండికోటను సందర్శిస్తూ అక్కడి అందాలను ఆస్వాదిస్తూ ఉంటారు. కోట ముందరి భాగంలో ఉన్న దర్గా వద్ద హిందువులు కూడా ప్రార్థనలు చేస్తారు. ఆ విధంగా హిందూ – ముస్లిం ఐక్యతకు గండికోట వేదికగా నిలుస్తోంది. అదే విధంగా తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగంగా విలసిల్లిన విజయనగరరాజు కృష్ణదేవరాయల కాలంలో గండికోటలో సాహిత్య సృజన జరిగి సాంస్కృతిక వికాసం విలసిల్లింది. గండికోటలో చూడదగిన వివిధ ప్రదేశాల గురించి తప్పక ప్రస్తావించుకోవాలి.

జుమ్మా మసీదు

ధాన్యాగారానికి దక్షిణాన జుమ్మా మసీదు కనిపిస్తుంది. మసీదు ప్రాకారం చుట్టూ లోపల 64 గదులు బయట 32 గదులు ఉన్నాయి. మూడు ప్రత్యేక ద్వారాలతో 2 మినార్లతో జుమ్మా మసీదు పర్యాటలకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మసీదు బయటి గదులను గుర్రపు శాలలుగా ఉపయోగించే వారని చెబుతారు. మసీదు ఎదురుగా విశాలమైన చప్టా మధ్యలో నీటి బుగ్గ ఉండేది. రాయల చెరువు నుండి ఇక్కడికి నీరు సరఫరా అయ్యేదట. మసీదు ఆగ్నేయ భాగంలో బావి కూడా ఉంది. మసీదు ప్రవేశ ద్వారం గడపమీద పద్మం చెక్కి వుంటుంది. ఆ ఎదురుగా విశాలమైన కోనేరు కూడా వుంటుంది.

ధాన్యాగారం

ఉత్తర దిశలో ధాన్యాగారం ఉంది. దీన్ని మీర్ జుమ్లా నిర్మించాడు. దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న ఈ భవనం లోపల 12 పెద్ద స్తంభాలు రెండు వరుసల్లో కనిపిస్తాయి. ధాన్యాగారం పైకి ఎక్కడానికి ఉత్తరం వైపున మెట్లు ఉన్నాయి. ప్రస్తుతం దీన్ని పురాతత్వ శాఖ కార్యాలయంగా వినియోగిస్తున్నారు.

ఎర్ర కోనేరు

జుమ్మా మసీదు ఎదురుగా ఎర్ర కోనేరు ఉంది. కోనేరులోని నీరు ఎర్రగా ఉండడం వల్ల దానికా పేరు వచ్చింది. యుద్ధం తరువాత సైనికులు రక్తపు కత్తులు కడగటం వల్ల నీళ్ళు ఎర్రగా మారాయని



మసీదు ముందరి గదులు

సినిమా షూటింగ్‌లూ...

తన సహజ అందాలతో ముగ్ధ మనోహర దృశ్యాలతో రమణీయంగా ఉన్న గండికోట పర్యాటకులతో పాటు ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర పరిశ్రమ మనసును కూడా దోచుకుంది. ఇక్కడ అనేక సినిమా షూటింగ్‌లు జరుపుకోవడమే ఇందుకు తార్కాణం. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో సునీల్, సలోని నాయికలుగా నిర్మించిన మర్యాద రామన్న చిత్రం సగభాగానికి పైగా ఇక్కడే షూటింగ్ పూర్తి చేసుకొని విజయవంతమైన చిత్రంగా నిలిచింది. అలాగే గోపీచంద్, తాప్సీ నటించిన సాహసం చిత్రంలో అనేక సన్నివేశాలు ఇక్కడే షూటింగ్ చేశారు. తెలుగుతో పాటు అనేక తమిళ కన్నడ సినిమాలు కూడా ఇక్కడ షూటింగ్ జరుపుకుంటున్నాయి. ఇలా తన సహజ అందాలతో రమణీయ దృశ్యాలతో గండికోట పర్యాటకులను రంజింపచేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

అందుకే ఈ కోనేటికి కత్తుల కోనేరు అనే పేరు కూడా వచ్చిందని చెబుతారు.

చార్ మినార్ (కావలి మండపం)

కోటలోకి ప్రవేశించగానే కావలి మండపంగా పిలవబడే చార్ మినార్ కనిపిస్తుంది. దీనిని గోల్కొండ నవాబుల కాలంలో నిర్మించారు. ఈ చార్‌మినార్‌ను నాలుగు అంతస్తులుగా, నాలుగు స్తంభాల ఆధారంగా దక్కన్ శిల్పరీతిలో నిర్మించారు. ఆవరణంలో విరిగిపోయిన ఫిరంగి గొట్టం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. దీనిని 'పావురాల మండపం' అని కూడా అంటారు.

కారాగారం

కావలి మండపానికి సమీపంలో కారాగారం ఉంది. యుద్ధ సమయంలో అదుపులోకి తీసుకున్న రాజ కుటుంబీకులను, నేరస్థులను ఈ కారాగారంలో బంధించే వారు. గండికోట రాజ్యంలో నేరస్థులకు విధించే శిక్షలు కఠినంగా ఉండేవి. రాజ ద్రోహానికి పాల్పడిన సామంత రాజులను బంధించి తెచ్చి కడుపులోకి సూది కర్రను ఓదెగా వేసి చంపేవారట. భారీ దొంగతనం చేసిన వారికి గడ్డం కింద గాలం గుచ్చి వేలాడదీసి శిక్షించేవారు. చిన్న దొంగతనానికి ఒక కాలు, ఒక చేయి తీసేసేవారు. అత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేవారు. నేరస్థులను పట్టుకొచ్చి జైలులో మెట్లు లేని కందకంలోకి తోసేసి బందీలుగా పడేసేవారు.

రాజ దర్బార్, రంగమహల్

జుమ్మా మసీదుకు వెనుక భాగంలో నైరుతి దిశలో రాజదర్బార్, రంగమహల్ ఉన్నాయి. ఇక్కడే ఒక మసీదు, కోనేరు కూడా ఉన్నాయి. ఈ కోనేటిని రాణులు స్నాన వాటికగా ఉపయోగించేవారు. అక్కడే రంగ మహల్ వెనుక అత్యంత సుందరమైన రాణి 'ఉయ్యాల మందిరం' కనిపిస్తుంది. రాజు కొలువు తీరే రాజ దర్బార్ ఎత్తైన వేదికపై ఉంది. వ్యాయామశాల కూడా ఉంది. ఇవన్నీ ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి.

మాధవరాయ స్వామి ఆలయం

అద్భుతమైన శిల్పకళతో ఎత్తైన గోపురంతో శ్రీమాధవరాయ స్వామి ఆలయం గండికోటకే తలమానికంగా నిలుస్తోంది. ఎత్తైన వేదికపై నిర్మించబడ్డ ఈ ఆలయ ప్రవేశ ద్వారం లోపలివైపున రమణీయంగా చెక్కబడిన సాలభంజికలు ఆకట్టుకుంటాయి. ఆలయంలో కళ్యాణ మండపం, రంగ మండపం, ఆగ్నేయ మూలన స్నానశాల, అలంకారశాల, ఉత్తరాన ఆళ్వారుల ఆలయం, 55 స్తంభాలతో కూడిన వసారాతో శ్రీమాధవరాయ స్వామి ఆలయం అలరారుతోంది. ఆలయం గోపురం నాలుగు అంతస్థులతో నిర్మితమై అసంపూర్తిగా కనబడుతోంది. గోపురం పైకప్పు మీద మొసలి, తాబేలు, చేప బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. కోష్ట పంజరంలో మహవిష్ణువు, గోవర్ధనధారి మురళీకృష్ణ, విఘ్నేశ్వర ప్రతిమలు ఉన్నాయి. ఆలయం అర్ధ మండపంలో 16 స్తంభాలు ఉన్నాయి. వీటిలో 4 స్తంభాలపైన విఘ్నేశ్వరుడు గరుడారోహులైన లక్ష్మీ నారాయణ, శ్రీరాముడు, ఆంజనేయుడు, యోగ నరసింహ తదితర శిల్పాలు ఉన్నాయి. అర్ధ మండపంలో ముందు 4 స్తంభాలతో కూడిన నాట్య మండపం ఉంది. ఈ మండపంలోని స్తంభానికి చేరువగా ఉన్న స్తంభాలపై సంగీత వాద్య పరికరాలను ధరించిన స్త్రీ , పురుష విగ్రహాలు ఉన్నాయి. తొండాన్ని ఎత్తిన ఏనుగు, దానిపై రెండు కాళ్ళపై లేచిన గుర్రం, ముఖం మాత్రం గుర్రానికి బదులు సింహం ఉన్న శిల్పాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇలాంటి స్తంభాలను "యాళీ స్తంభాలు" అంటారు. ఈ ఆలయంలోని అనేక శిల్పాలను చంద్రగిరిలోని మ్యూజియానికి తరలించారు. ఆలయంలోని శ్రీమాధవరాయ స్వామి మూల విరాట్టు మైదుకూరుకు తరలించబడిందని స్థానిక కథనం.



కారాగారం

మినార్



ఆలయం లోపలి శిల్ప కళాసౌందర్యం

ముగ్ధ మనోహర దృశ్యం - పెన్నా లోయ

గండికోటకు పడమర -ఉత్తర దిక్కులతో పెన్నా నది ప్రవహిస్తుంది. ఎర్రమల కొండల మధ్య సుమారు 8 కి.మీ. దూరం వ్యాపించిన పెన్నా లోయ పర్యాటకులను ఆహ్లాద పరుస్తుంది. పెన్నా నది గండికోటకు సహజ సిద్ధంగా ఏర్పడిన కందకంగా ఉపయోగపడుతోంది. కోట నుండి చూస్తే దాదాపు 300 అడుగుల లోతులో 250 అడుగుల వెడల్పుతో పెన్నా నది కనిపిస్తుంది. కోట నుండి ఉత్తర పశ్చిమ దిశలలోని నాలుగు ద్వారాల గుండా పెన్నానది లోయలోకి వెళ్ళవచ్చు. లోయలో 5 కి.మీ. పొడవునా అక్కడక్కడా ఆలయాలు, విశ్రాంతి మండపాలు కనిపిస్తాయి. పెన్నా నది ఒడ్డున నిలబడి దక్షిణం వైపు చూస్తే ఎత్తైన కోట గోడలు బురుజులతో కోట రాజదర్పం ఉట్టిపడుతుంటుంది. పెన్నా నదీ దృశ్యాలను పాశ్చాత్య చిత్రకారులు థామస్ ఫ్రేజర్, థామస్ యాంబూరే క్రీ.శ. 1800 కాలంలో తైల వర్ణ చిత్రాలుగా మలిచారు. పెన్నా లోయలో ఆలయాలు మండపాలు మాత్రమే గాకుండా ఉత్తర ఒడ్డున పండిగవి, దక్షిణ దిశన తల్లేటి గుండు దర్శించవచ్చు. తల్లేటి గుండు వద్ద కర్నాటక నుండి వచ్చే భక్తులు కేశ ఖండన మహోత్సవాలు చేస్తారు. గుండు నుండి విభూది అరగదీసి ధరిస్తారు. అయితే లోపల పెన్నా నీటి ప్రవహం లేనప్పుడు ఇవి చూడవచ్చు. గండికోట లోని పడమర మెట్ల గుండా పెన్నా నదీ లోయలోకి దిగి ఉత్తర దిశగా కొంత దూరం వెళ్ళి నదిని దాటితే అగస్తేశ్వర కోన వెళ్లొచ్చు. పూర్వం ఏనుగులు గుర్రాలు కోటలోని పడమట మెట్ల గుండా పెన్నానదీ లోయలోకి నీళ్ళకు, మేతకు వెళ్ళేవి. అమెరికాలోని సుందర లోయ "గ్రాండ్ కాన్యన్" కు తగ్గని అందం పెన్నా లోయ సొంతం.



పెన్నా గండి (గార్జ్)



కోనేరు

శ్రీరఘునాథ ఆలయం

ధాన్యాగారానికి ఉత్తర దిశలో ఎత్తైన గుట్టపై రఘునాథ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని రంగనాయక ఆలయం అని కూడా అంటారు. ముఖ్య ప్రవేశ ద్వారం తూర్పు ముఖమై ఉంది. ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించబడింది. ప్రాకారంలో కళ్యాణ మండపం, ఉత్సవ మండపం, అలంకారశాల, పాకశాల, యాగశాలలు ఉన్నాయి. గర్భ గుడిలో మూల విరాట్టు విగ్రహం లేదు. ఈ ఆలయ మూల విరాట్టు అయిన రంగనాయక స్వామి విగ్రహం గండికోటకు సమీపంలోని మైలవరం పురావస్తు శాఖ మ్యూజియంలో ఉంది. స్నాన ఘట్టంపై ముందరి భాగంలో ఆంజనేయ స్వామి ప్రతిమ ఉంది. అర్ధ మండపం పదహారు స్తంభాలతో నిర్మించబడింది. ఒక్కొక్క వరుసకు 4 స్తంభాల చొప్పున నాలుగు వరుసలలో ఈ స్తంభాలు ఉన్నాయి. 24 స్తంభాలతో ముఖ మండపం నిర్మితమైంది. గజాలు, నృత్యం చేస్తున్న స్త్రీలు, హంస, ఖడ్గము, డాలు పట్టుకున్న సైనికులు, సింహం, వినాయకుడు, నరసింహ, గుర్రాలు, సంగీత వాయిద్యాలను ఉపయోగిస్తున్న ప్రతిమలేగాక యోగాసనంలో ఉన్న పురుషుని ప్రతిమ, కామశిల్పాలు, ఏనుగులను వేటాడు తున్న భటుల శిల్పాలు ఉన్నాయి.

రాయల చెరువు (నీటి కొలను)

గండికోట ఆగ్నేయ భాగంలో కోట గోడ సమీపంలో రాయల చెరువు ఉంది. దీన్ని పూర్తిగా రాతితో నిర్మించారు. అందుకే ఈ చెరువును రాతి చెరువు (రాజుల చెరువు) అని కూడా అంటారు. యుద్ధ సమయంలో కోటను లోపల నుంచి దిగ్బంధనం చేసిన సందర్భాల్లో నెలల తరబడి కోటలోని రాజపరివారానికి ఇతరులకు నీటి అవసరాలను రాయల చెరువు తీర్చేది. ఇప్పటికీ కోట లోపల భూములను సాగు చేసేందుకు రైతులు రాయల చెరువు నీటిని వినియోగిస్తున్నారు. ఈ చెరువు నుండి జుమ్మా మసీదులోని ఫౌంటైన్‌కు నీరు సరఫరా అయ్యేది. రాయల చెరువుకు సమీపంలో తూర్పున నీటి గొట్టాల వ్యవస్థ కనబడుతుంది. ఈ గొట్టాల గుండా నీటిని జుమ్మా మసీదుకు తరలించేవారు.



కోట ప్రహరీ

చెక్కుచెదరని గండికోట గోడ

గండికోటకు చుట్టూ మూడు రాతి ప్రాకారాలు ఉన్నాయి. తూర్పు, పశ్చిమాన రెండు ప్రవేశ ద్వారాలు, ఒక అగడ్త ఉన్నాయి. కోట గోడలను ఒక టన్ను బరువు ఉండే ఎర్రటి నున్నటి శాణపురాళ్ళతో నిర్మించారు. పునాదులు లేకుండానే కొండ బండలపై కోట గోడలను నిర్మించడం ఈ కోట ప్రత్యేకత. తూర్పు నుండి పడమర వరకూ కోట పొడవు 1200 మీ.. వెడల్పు 800 మీ.. ఉంది. ఎన్నో అడుగులు ఎత్తైన కోట గోడ చుట్టూ 101 బురుజులు ఉన్నాయి. కోట తూర్పు వైపున ఉన్న ప్రధాన ప్రవేశ ద్వారం 20 అడుగుల ఎత్తు ఉంటుంది. కోట ద్వారాలకు ఇనుప గుబ్బడాలు బిగించి శత్రు దుర్భేద్యంగా నిర్మించారు. కోట ద్వారాలను మూయడానికి, తెరవడానికి ఏనుగులను వినియోగించేవారు. కోట చుట్టూ సైనికులు పహారా కాచేందుకు 5 మీ. వెడల్పాటి బాటను నిర్మించారు. శత్రువుల రాకను గమనించేందుకు సొరంగ గండ్లు, ఫిరంగుల ప్రయోగానికి రంధ్రాలు కూడా ఉన్నాయి.



అపికో.. దక్షిణ చిప్కో...

భూమ్మీద 5 మహా సముద్రాలు, 7 ఖండాలున్నాయి. ప్రపంచంలో 7 వింతల చిట్టాలు ఎవరివి వారికున్నాయి. కానీ, ఇవన్నీ నిండిన ప్రపంచానికి జీవం నింపేవి, ఊపిరినిచ్చేవైన జీవ వైవిధ్య నిలయాల్లో అతి ముఖ్యమైన ఎనిమిదింటిలో ఒకటి మన దేశంలోనే ఉందని తెలుసా. అదే పశ్చిమ కనుమల్లోని సహ్యాద్రి పర్వత శ్రేణి. మరో చిప్కో అయిన అపికో ఉద్యమం ద్వారా వీటిని కాచాడు పాండు రంగ హెగ్డే.

చిప్కో ఉద్యమం గురించి చాలామందికి తెలుసు. పాఠ్య పుస్తకాల్లోను చోటు దక్కించుకున్న పర్యావరణ హిత విప్లవమది. ఉత్తరాన చెట్లు నరక్కుండా సుందర్‌లాల్ బహు గుణ నేతృత్వంలో మహిళలు చెట్లకు హత్తుకున్న ఆ ఉద్యమం గొప్ప మార్పు తెచ్చింది. భారత దేశ మ్యాప్‌లో రోజు రోజుకీ మాయమౌతున్న అటవీ సంపదను కాపాడుకునే యత్నమైన 1970ల నాటి చిప్కో ఉద్యమంలో పాండు రంగ హెగ్డే పాల్గొ న్నారు. అకౌంటింగ్ రంగంలో మంచి పేరు తెచ్చుకున్న ఆయన వృత్తిని వదిలి ఢిల్లీ స్కూల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్‌లో పీజీ పూర్తిచేశారు. సమాజానికి ఉద్యోగం ద్వారా సేవ చేద్దామని సుందర్‌లాల్ బహుగుణాను కలిసిన పాండు రంగ హెగ్డేకు ఓ సమాధానం లోతుగా తగిలింది. చిప్కోలో ఉద్యోగు లంటూ ఎవరూ లేరు. ఇక్కడంతా మూగవైన చెట్లు, నదులు, కొండలు, అడవుల తరపున మాట్లాడే, పోరాడే ప్రతినిధులు, ఉద్యమకారులు మాత్రమే ఉంటారు. బహుశా నీలా ఉద్యోగం కోసం వచ్చే వారు వేరే చోట వెతుకోవచ్చు.. అని బహుగుణ నోట వచ్చిన జవాబుతో హెగ్డే ఆలోచనలో పడిపో యారు. సామాజిక సంక్షేమమంటే ఏదో సరికొత్త ఉద్యోగమో, వృత్తో కాదని తేలిపోయింది. నిస్వార్థంగా, పూర్తిగా ఉద్యమానికే అంకితమయ్యే నిరంతర కార్యరంగమని తెలుసుకున్న ఆయన బహుగుణాను మెప్పించి చిప్కోలో క్రియాశీల పాత్ర నిర్వహించారు.

సహ్యాద్రి సేవకు..

చిప్కో ఉద్యమం విజయవంతమయ్యాక 1983లో తన సొంత రాష్ట్రం కర్నాటకలోని సిర్సి అటవీ ప్రాంతానికి వచ్చి అపికో ఉద్యమాన్ని లేవదీశారు. కన్నడలో అపికో అంటే హత్తుకోవడమని అర్థం. చిప్కో కూడా అదే భావం కలది. పేర్లలో సారూప్యాలే కాదు తెచ్చిన మార్పు కూడా అదే స్థాయిలో ఉంది. సహ్యాద్రి శ్రేణుల్లో కలప కోసం భారీగా చెట్లను నరికేసేవారు. జీవ జాలం మొత్తం మీద ప్రభావం పడి అతి అరుదైన, విలక్షణమైన వన్య వ్యవస్థ కకావికలమౌతున్న తరుణంలో పాండు రంగ పోరాటం మొదలు పెట్టారు. వేల మంది పర్యావరణ హితకారుల్ని, గ్రామస్తులను, కార్యకర్తలను పోగుచేసి కలప అక్రమ వ్యాపారానికి గొడ్డలి దెబ్బ వేశారు. దేశంలో తొలిసారిగా అడవిలోని చెట్ల నరికివేతను నిషేధిస్తూ కర్నాటక చట్టం చేయడానికి కారణం ఈ ఉద్యమమే. కేవలం కర్నాటకకే పోరాటం పరిమితం కాకుండా పశ్చిమ కనుమల వ్యాప్తంగా కేరళ, తమిళనాడు, గోవా రాష్ట్రాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అపికో వల్ల కొన్ని వేల ఎకరాల అడవులు సంరక్షించబడ్డాయి. లక్షల సంఖ్యలో చెట్లు గొడ్డలి పెట్టు పడకుండా మిగిలాయి. ఈ గొప్ప విజయానికి గుర్తుగా 2005 నుంచి సహ్యాద్రి దినోత్సవాన్ని అపికో ఉద్యమం స్ఫూర్తిగా అధికారికంగా నిర్వహించుకుంటున్నారు. ఈ ఏడాది తుముకూరు జిల్లాలోని తిప్తూర్ అరణ్యంలో పర్యావరణ వేడుక నిర్వహించారు. ఇప్పటికీ అపికో కార్యకర్తలు అడవుల్లో నిఘా ఉంచారు. అటవీ శాఖతో సంబంధం లేకుండా వారు తమ విధుల్ని నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ గొప్ప విజయానికి కారణం కేవలం అక్రమ వ్యాపారానికి చెక్ పెట్టడమే కాదు. సహ్యాద్రి అరణ్యాల ప్రాముఖ్యతను, విలక్షణీయతను స్థానికులకు తేలిగ్గా వివరించి చెప్పి వాటి పరిరక్షణకు సంఘటితం చేయడం ద్వారా పశ్చిమ కనుమలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఈ ఒక్క చోట అటవీ వ్యవస్థ తారుమారైతే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వచ్చే మార్పుల గురించి, దేశంలో ఏర్పడే విపరీత పరిస్థితుల గురించి, ముఖ్యంగా స్థానికంగా ఎదురయ్యే ఉపద్రవాల గురించి స్పష్టమైన అవగాహన కలిగించారు హెగ్డే. పూర్తిగా అటవీ సంరక్షణకే అంకితమై పనిచేస్తున్న హెగ్డే తన తర్వాత వాటిని కాచుకుని చూసేందుకు తర్వాతి తరాలకు శిక్షణనిస్తున్నారు. ప్రకృతి అనే సంస్థను స్థాపించి పర్యావరణ హిత కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నాడు. 1991లో ప్రారంభించిన ఈ సంస్థ స్థానిక సిద్ది తెగలతో కలిసి పనిచేస్తోంది. జీవ వ్యవస్థకు ఆటంకం కలగకుండా వన ఉత్పత్తులను ఎలా సేకరించాలో ఆ తెగలకు బాగా తెలిసిన విద్య. వీరి పద్ధతుల్లో తేనె సేకరణ, కలప అవసరం లేకుండా సహజ ఫైబర్లతో బుట్టల తయారీ వంటి విషయాల్ని విద్యార్థులకు నేర్పిస్తున్నారు. అయితే కొన్నేళ్ల నుంచి ఊపందుకున్న పట్టణ, నివాస ప్రాంతాల అభివృద్ధి నిర్మాణాలు, కార్యకలాపాలతో క్రమంగా అటవీ శాతం తగ్గిపోతున్నట్టు గాడ్గిల్ రిపోర్టుల్లో తేలడంతో మరో ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు పాండు రంగ హెగ్డే. 'సేవ్ ది వెస్ట్రన్ ఘాట్స్' ప్రచారోద్యమానికి కన్వీనర్‌గా పని చేస్తున్నారు. కనీసం 66 శాతం అడవి నిండక పోతే పర్యావరణం ప్రమాదంలో పడిపోతుందని హెచ్చరిక నేపథ్యంలో ఈ ఉద్యమానికి బలాన్ని చేకూర్చేందుకు ఆయన విశేషంగా కృషి చేస్తున్నారు. స్వతహాగా రైతు అయిన హెగ్డే వ్యవసాయ విధానాల వల్ల కూడా అటవీ వ్యవస్థకు ముప్పు కలుగుతోందని గుర్తించి పర్యావరణానుకూల సేద్య పద్ధతుల్ని ప్రవేశపెట్టారు. అటవీ వ్యవస్థకు ముప్పులేని 1500 ఏళ్ల క్రితం నాటి స్థానిక వ్యవ సాయ పద్ధతులకు స్థానికులు మళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. సుగంధ ద్రవ్యాల రాణిగా గుర్తింపు పొందిన ఈ నేల కలప వాణిజ్య రాణిగా మారడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి పాత గుర్తింపును దక్కించుకునేంత వరకు ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని ఆయన చెబుతున్నారు.

✦

నవ్వుల్ – పువ్వుల్



దూరం



పెళ్ళయి పదేళ్ళయ్యింది. పెళ్ళాంతో గొడవలు పడలేకపోతున్నానని సమస్యను పరిష్కరించుకునేందుకు మ్యారేజ్ కౌన్సిలర్‌ని కలిశాడతను. తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు.

ముందు మీరు ఓ పని చెయ్యండి. రోజుకి అయిదు కిలోమీటర్లు చొప్పున ఓ వారం పాటు పరిగెత్తండి. పరిగెత్తి నాకు ఫోన్ చేసి చెప్పండి" అన్నాడు కౌన్సిలర్. అలాగేనన్నాడతను. వారం రోజులైంది కౌన్సిలర్‌కి ఫోన్ చేశాడతను.

"చెప్పండి. ఇప్పుడు మీరు మీ ఆవిడా ఎలా ఉన్నారు?" అడిగాడు కౌన్సిలర్.

"ఎలా ఉంటాం, తనూ నేను ముప్పయి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాం" అన్నాడతను.

కోటి వేషాలు

సార్ ధర్మం చేయండి సార్!

"పోవయ్యా అడుక్కోవడానికి సిగ్గులేదా"!

"అలా తీసిపారేయకండి సార్... నేనొక కవిని

డబ్బు సంపాదించడానికి కోటి మార్గాలు అనే పుస్తకం రాసింది నేనే అని చెప్పాడు

నిజమా మరి అడుక్కుంటున్నావెందుకు

ఆ కోటి మార్గాలలో ఇదొకటి సార్ !

ఫేక్ అకౌంట్

చింటు: నాన్నా నాకు ఫేస్ బుక్‌లో అమ్మాయిల పేరుతో ఐదు ఫేక్ అకౌంట్స్ ఉన్నాయ్ తెలుసా?

చలపయ్య: అరేయ్ వెధవా, ఇంకేం పనీ పాటా లేదా? అయినా ఇప్పుడు ఆ దరిద్రం గురించి నాకు ఎందుకు చెబుతున్నావ్ ఇప్పుడు?

చింటు: ఏం లేదు నాన్నా గత నెల రోజులుగా నువ్వు చూస్తున్న స్నేహ అకౌంటు కూడా నాదే......!!!!

అపరకర్ణుడు

"అయ్యా నాపేరు సత్యమూరి. ఈ చుట్టుపక్కల పది గ్రామాల్లోకెల్లా ధనవంతులు మీరు. మీరు అపర దానకర్ణులని చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేస్తారని చాలా మంది చెప్పారు. అందువల్ల ఆశతో చాలా దూరం నుంచి వచ్చాను.ఏదైనా సాయం చేసి పుణ్యం కట్టుకోండి" కోటీశ్వరుడు విశ్వామిత్రతో మొరపెట్టుకున్నాడు

ఓ చిన్న సాయం చెయ్యండి మీరు వెంటనే తిరిగి వెళ్ళి అవన్నీ ఒట్టిమాటలని వారందరితో చెప్పండి అన్నాడు కోటీశ్వరుడు.

టైమెంత

సార్ టైమెంతయింది అడిగాడు సుధీర్.

తొమ్మిదీపది చెప్పాడు వాచి చూసి చెప్పాడు శంకర్

కరెక్టుగా చెప్పండి సార్ మరీ గంట తేడాతో చెబుతారేం విసుకున్నాడు సుధీర్.

వెయిటింగ్ రూంలెందుకు?

ప్రతి రైలూ లేటుగా వస్తే ఈ పనికి మాలిన టైం టేబుల్ ఇక్కడెందుకూ?

రైల్వే అధికారితో పేచీ పెట్టుకున్నాడు రామానందం.

ప్రతి రైలు కరెక్టు టైంకు వస్తే నీవు విశ్రాంతి తీసుకుంటున్న ఈ వెయిటింగ్ రూంలు ఎందుకు? మరింతగా మిర్రి చూస్తూ అన్నాడు రైల్వే అధికారి.



నేటి ఐన్‌స్టీన్ల

కొన్ని రోజుల క్రితమే ఓ కొత్త ఆదిమానవ జాతి అవశేషాల్ని దక్షిణాఫ్రికాలో
జాతికి 'హోమో నలెదీ' అని పేరు పెట్టారు. మరో పక్క లార్జ్ హ్యాడ్రన్ కొ
ఫండమెంటల్ సిమ్మెట్రీ ఉందని తేల్చారు. అణు స్థాయిలో ఉండే భౌతిక ధ
మలుపు తిప్పిన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు ఎన్నో ఉన్నాయి. వాటి జీ
కారణమయ్యాయి. అధునాతన సమాజ నిర్మాణంలో అతి కీలకమైన ఆ
ఇప్పటికీ కొందరు మరింత పరిశోధనలతో ముందుకెళుతుంటే మరికొ
పనిలో నిమగ్నమయ్యారు. న్యూటన్, లూయీ పాశ్చర్, నికోలస్ టెస్లా,
నేటి తరం శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు సజీవ స్ఫూర్తి కేంద్రాలుగా అభి
కాలపు ఐన్‌స్టీన్, లూయీ పాశ్చ

స్పృహతో సైన్స్

సైన్స్ ఫిలాసఫర్‌గా పిలవబడుతోన్న రోజర్ పెన్‌రోజ్ క్వాంటమ్ థియరీ, స్యూడో యూనివర్స్, ట్విస్టర్ థియరీ, పెన్‌రోజ్ స్టెయిర్స్ వంటి ఎన్నో పరిశోధనాత్మక అంశాల్లో తన ముద్ర వేశారు. కాస్మోలజీ, ఫండమెంటల్ ఫిజిక్స్‌కే పరిమితం కాని ఈ ఆంగ్ల శాస్త్రవేత్త హ్యూమన్ కాన్సియస్‌నెస్ (మానవ స్పృహకు) శాస్త్రీయతను ఆపాదించి సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. ట్రైబార్ వంటి త్రికోణాన్ని ఆవిష్కరించి చిన్న వయసులో అందరినీ దృష్టిని ఆకట్టుకున్నారు. ఈయనకు ఇప్పుడు 84 ఏళ్లు.



డీఎన్‌ఏ కట్టుబడి

జీవ శాస్త్రంలో ల్యాండ్‌మార్క్‌గా నిలిచిపోయిన డీఎన్‌ఏ స్ట్రక్చర్ డీకోడింగ్ చేసిన వారిలో ఒకరు జేమ్స్‌వాట్సన్. ఈ అమెరికన్ శాస్త్రవేత్త కణ జీవశాస్త్రం రంగంలో అతిముఖ్యమైన వ్యక్తి. జీవ కణాల్లో సమాచార మార్పిడి ఎలా జరుగుతుందనే విషయాన్ని వివరించిన ఈయన పరిశోధనలు ఎంతో కీలకమైన మార్పుల్ని వైద్యరంగంలో ప్రవేశపెట్టాయి. కేన్సర్‌పై పరిశోధనలు సాగిస్తున్న జేమ్స్ వాట్సన్ ఎన్నో సైన్స్ పుస్తకాల్ని రాశారు. వాటిలో బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది డీఎన్‌ఏ నిర్మాణాన్ని వివరించే 'డబుల్ హెలిక్స్' పుస్తకం. ఈయనకిపుడు 87 ఏళ్లు.

విశ్వ వ్యాప్తి



జూనియర్ పార్టికల్ ఫిజిసిస్ట్‌గా ఉన్నపుడే విశ్వం తొలినాళ్ల కాలం నాటి పరిస్థితుల్ని వివరించే కాస్మిక్ ఇన్‌ఫ్లేషన్ థియరీని పరిచయం చేసి నివ్వెరపరిచిన శాస్త్రవేత్త అలాన్ హార్వే గుత్. అమెరికాకు చెందిన గుత్ 1980ల్లో చెప్పిన ఈ విషయాన్ని 2006లో డబ్ల్యుమ్యాప్ మిషన్ ద్వారా సరైందేనని తెలుసుకున్నారు. వాక్యూమ్ శక్తి సాంద్రతల వల్ల తొలినాళ్ల విశ్వం ఊహించనంత పరిమాణంలో వ్యాప్తి చెందిందనేది కాస్మిక్ ఇన్‌ఫ్లేషన్ సారాంశం. బైసెప్, కెర్క్ ఆర్రే టెలిస్కోప్ కొలతల నిర్ధారణ ద్వారా ఈ సిద్ధాంతానికి మరింత బలం చేకూరింది. ఈయనకిపుడు 68 ఏళ్లు.

మనిషీ జంతువే

ఆది మానవునికి జంతువులకు మధ్య ఉన్న లింక్‌ను కలిపేందుకు చింపాజీలపై పరిశోధనల ద్వారా ఊహించని వాస్తవాల్ని వెలుగులోకి తెచ్చిన జంతు శాస్త్రవేత్త డేమ్ జేన్ మోరిస్ గుడాల్. ఇంగ్లండ్‌కు చెందిన గుడాల్‌ను ఆ తరహా పరిశోధనలకు నాంది పలికిన వ్యక్తిగా కీర్తిస్తారు. 55 ఏళ్ల పాటు టాంజేనియాలోని గోంబె స్ట్రీమ్ జాతీయ పార్కులోని చింపాజీల కుటుంబ, సామాజిక జీవనాలను పరిశోధించారు. 81 ఏళ్ల వయసులోను జంతు పరిరక్షణ కార్యక్రమాలకు నేతృత్వం వహిస్తున్నారు.

...ర్యం పాశ్చర్యం...

...కనుగొన్నారని ప్రకటించారు. హోమోసేపియన్స్‌కు పూర్వీకులుగా భావిస్తున్న ఈ
...డర్‌లోని ఏలిస్ హెవీ అయాన్ డిటెక్టర్‌తో పరిశోధనలు చేసి ప్రకృతిలో
...ర్మాల్లో చిక్కుముడులను విప్పేందుకు కీలకం కానుందిది. ఇలా 21వ శతాబ్దిని కీలక
...లు 20వ శతాబ్దిలోనే పడి ఇప్పుడు మనం చూస్తున్న ఎన్నో విప్లవాత్మక మార్పులకు
...ష్కరణలు చేసిన శాస్త్రవేత్తల్లో కొందరు ఇంకా తమ సేవల్ని అందిస్తూనే ఉన్నారు.
...దరు తమ విజ్ఞానాన్ని సామాన్యుల వరకు తీసుకెళుతూ శాస్త్రీయ చైతన్యం తెచ్చే
...న్‌స్టీన్ వంటి ప్రసిద్ధ శాస్త్రవేత్తల కోవకు చెందిన వారిగా గుర్తింపు తెచ్చుకున్నారు.
...నాన్ని మూటగట్టుకున్నారు. సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌ను ఈ తరంలో పెంచిన నేటి
...లైన వీరిలో కొందరి గురించి.

- అజయ్ కుమార్ వారాల

నెట్‌కు కనెక్ట్

వరల్డ్ వైడ్ వెబ్‌ను ప్రపంచానికి అందించి ఇంటర్‌నెట్ సేవల్ని విస్తృతం చేసిన వ్యక్తి తిమోతి జాన్ "టిమ్" బెర్నెర్స్-లీ. సమాచార విప్లవానికి ఊపిరిలూదిన ఈ ఆవిష్కరణ వల్లే ఇప్పుడున్న అంతర్జాల ప్రపంచమంతా పరుచుకుని 'ఉంది. ప్రపంచాన్ని నెట్‌కు కనెక్ట్ చేసిన ఈ శాస్త్రవేత్త తన పరిశోధనల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇంగ్లండ్‌కు చెందిన బెర్నెర్స్ లీ ప్రస్తుతం వరల్డ్ వైడ్ వెబ్ కన్‌సార్షియంకు నేతృత్వం వహిస్తున్నారు. ఎంఐటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెల్లిజెన్స్ లాబొరేటరీకి ఫౌండర్స్ చైర్‌లో కొనసాగుతున్నారు. 60 ఏళ్ల బెర్నెర్స్ వేగవంతమైన సమాచార మార్పిడికి కృషి చేస్తున్నారు.

జనం-జన్యువు



మానవ జన్యుక్రమ ప్రాజెక్ట్‌ను చేపట్టి మన్ననలు పొందిన జన్యు శాస్త్రవేత్త క్రెగ్ వెంటర్. సింథటిక్ జీనోమ్స్, కృత్రిమంగా కణాల నిర్మాణం వంటి పరిశోధనలతో జీవంపై శాస్త్ర ప్రపంచానికి ఉన్న అవగాహనను చాలెంజ్ చేసిన మేధావిగా గుర్తింపు తెచ్చుకున్నారు. డీఎన్ఏపై పరిశోధనలు సాగించడానికి జె.క్రెయిగ్ వెంటర్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పిన ఈ అమెరికన్ శాస్త్రవేత్త సింథటిక్ బయోలాజికల్ ఆర్గానిజమ్స్‌ను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈయనకిపుడు 68 ఏళ్లు.

వాక్‌తత్వం

భాషా శాస్త్రం, మానసిక శాస్త్రాల తీరును మార్చిన మేధావి అవ్‌రామ్ నోమ్ చోమ్‌స్కీ.లింగ్విస్టిక్, సైకాలజీలపై వందకు పైగా పుస్తకాలు రచించిన ఆయనను ప్రపంచంలోనే ఉత్తమ ప్రజా మేధావిగా 2005లో ఎంపికయ్యారు. యూనివర్సల్ గ్రామర్ థియరీ సృష్టికర్తగా పేరు గడించారు. భాషా తత్వ శాస్త్రం, మెటాలింగ్విస్టిక్స్, మనో తత్వ శాస్త్రాల్లో ఆయన పరిశోధనలు ఆయా రంగాల గతి, రీతిని మార్చేశాయి.ప్రపంచ పరిణామాలపై తనదైన వాదంతో 86 ఏళ్ల వయసులోను తన వాణిని బలంగా వినిపిస్తున్నారు.

కృష్ణ బిలాలు... ఏలియన్లు...



న్యూరో మస్క్యులర్ డిస్ట్రోఫితో శరీరమంతా చచ్చుబడినా అంతరిక్ష శాస్త్రంలో విప్లవాత్మకమైన కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు స్టీఫెన్ హ్యాకింగ్. ఐన్‌స్టీన్‌తో సమానంగా ప్రజాదరణ పొందిన శాస్త్రజ్ఞుల్లో నేటికాలానికి చెందిన అద్భుతమైన వ్యక్తి. ఇంగ్లండ్‌కు చెందిన ఈ మేధావి 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పేరిట పుస్తకాన్ని ప్రచురించి సామాన్యులు కూడా శాస్త్ర విషయాలపై మక్కువ చూపేలా చేశారు. ఈ పుస్తకం వరసగా నాలుగేళ్లపాటు బెస్ట్ సెల్లర్ లిస్ట్‌లో నిలిచి రికార్డు సృష్టించింది. కృష్ణ బిలాలు, టైమ్ ట్రావెల్, ఏలియన్ లైఫ్‌పై ఆయన పరిశోధనలు శాస్త్ర ప్రపంచాన్ని ఆలోచింపజేశాయి. కృష్ణ బిలాలు సైతం రేడియేషన్ విడుదల చేస్తా యని చెప్పి సంచలనం సృష్టించారు. ఈయనకు ఇప్పుడు 73 ఏళ్లు.

హాస్య 'పద్మం'

పద్మనాభం (బసవరాజు వెంకట పద్మనాభరావు) పేరు వినగానే తెలుగు సినీ ప్రేక్షకుడు చక్కిలి గింతలా ఫీలవుతాడు. పద్మనాభం నటించిన పాత్రలన్నీ కళ్ళముందు కదలాడతాయి. ఒక విధంగా హాస్యానికి సరికొత్త భాష్యం చెప్పిన వ్యక్తిగా పద్మనాభాన్ని చెప్పుకోవచ్చు. తన ప్రత్యేక హావభావ ప్రదర్శన, వాచకం చెప్పడంలో చతురత, తాను ధరించిన పాత్ర పట్ల అవసరమైన పరిశోధన వంటి అంశాల ద్వారా ఆయన ముద్ర నేటికీ సజీవంగా ఉండేలా పరితపించిన వ్యక్తి పద్మనాభం.

కడప జిల్లా సింహాద్రిపురంలో ఆగష్టు 20, 1931న వెంకటశేషయ్య, శాంతమ్మ దంపతులకు జన్మించాడు. చిన్నతనం నుంచే పాటలు, పద్యాల పట్ల మక్కువ పెంచుకున్న పద్మనాభం నూనుగు మీసాలు రాకముందే బొగ్గుతో మీసాలు గీసుకొని ఆనాటి ప్రముఖ రంగస్థల నటుడు రఘురామయ్య గారిని అనుసరించేవాడు. చురుకైన పద్మనాభం చూపరులను ఇట్టే మెప్పించేవాడు. తన 21వ ఏట ప్రముఖ దర్శక నిర్మాత గూడవల్లి రామబ్రహ్మంగారి దృష్టిలో మొట్టమొదటిసారిగా 'మాయా లోకం' (1943) చిత్రంలో నటించాడు. తర్వాత సినిమా వేషాల కోసం పడరాని పాట్లు పడుతున్న సమయంలో దర్శక దిగ్గజం కె.వి. రెడ్డి గారి దృష్టిలో పడ్డాడు. పాతాళ భైరవి చిత్రంలో ఎస్వీరంగారావు (మాంత్రికుడు) శిష్యుడిగా నటించి పదుగురి మెప్పునూ పొందాడు. అయితే ఆయన దాహం తీరలేదు. ఆకలి దప్పికలు తీరలేదు. తనను గుర్తించి ప్రోత్సహించే గాడ్‌ఫాదర్స్ లేరు. భవిష్యత్తు కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కృషి, దీక్ష, పట్టుదలతో ప్రయత్నాలు కొనసాగించడమే. అప్పటికి రేలంగి ప్రభ వెలుగుతోంది. అగ్రహీరోలు సైతం రేలంగి ధాటికి తట్టుకోలేని రోజుల్లో ఈ బుడతడు ఎలా పైకొస్తాడు? అని సినీ విమర్శకుల ఊహాగానాలు. అయినా పద్మనాభం మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిపోయాడు.

తొలి రోజుల్లో చిన్న చిన్న పాత్రలు చేసినా అవి భక్తిరసానికే ప్రాముఖ్యతనిచ్చాయి. మాయాలోకం, త్యాగయ్య, నారద-నారది, యోగివేమన, షావుకారు, శ్రీకాళహస్తీశ్వర మహత్యం చిత్రాలు భక్తికే సరిపోయాయి. పాతాళ భైరవితో గుర్తింపు తెచ్చిన ఎన్.ఎ.టి. బ్యానర్‌లో మూడవ చిత్రం జయసింహతోపాటు, మరో చిత్రం పాండురంగ మహత్యం ద్వారా పద్మనాభం ఎన్టీఆర్ దృష్టిలో పడ్డాడు. పద్మనాభాన్ని ఎన్టీఆర్ నోరారా తమ్ముడు అని పిలిచేవాడు. ఆ బంధం చివరి వరకూ కొనసాగింది. తర్వాత పద్మనాభం దశ తిరిగింది. కుటుంబ గౌరవం, భాగ్యరేఖ, అప్పు చేసి పప్పుకూడు, రాజమకుటం చిత్రాలతో తనను తాను నిరూపించుకునే పాత్రలు చేశాడు. కృష్ణ లీలలు, ఆత్రేయ దర్శకత్వం వహించి నిర్మించిన వాగ్దానం చిత్రంతో కామెడీ స్టార్ ఇమేజ్ వచ్చింది. ఆ తరువాత పద్మనాభం వెనక్కి తిరిగి చూసుకోలేదు.

ఆణిముత్యాలు

తన నటనా శైలితో ప్రేక్షకుల మనోభారాన్ని కాసేపు పక్కకు పెట్టిన పాత్రలెన్నని చెప్పగలం? వాటిలో కొన్ని చిత్రాలను తెలుగు ప్రేక్షకులు గుర్తు చేసుకోకుండా ఉండలేరు. ఇద్దరు మిత్రులు, భార్యాభర్తలు, కుల గోత్రాలు, ఆత్మబంధువు, మూగమనసులు, చదువుకున్న అమ్మాయిలు, వెలుగు-నీడలు, డాక్టర్ చక్రవర్తి, తేనె మనసులు, పాండవ వనవాసం, పరమానంద శిష్యుల కథ, లేత మనసులు, పూలరంగడు, భక్త ప్రహ్లాద, ఆడపడుచు, బ్రహ్మచారి, కథానాయకుడు, అదృష్టవంతులు, ధర్మపత్ని, దసరా బుల్లోడు, అక్కా చెల్లెళ్ళు, ఇంద్ర ధనస్సు.. ఇలా ఎన్నో చిత్రాలు తన నట జీవితంలో పద్మనాభం చెరిగిపోని సంతకాలుగా మిగుల్చుకున్నాడు.

నిర్మాత, దర్శకుడిగా..

చెన్నై నాగార్జున నగర్ రెండవ వీధిలో చలం ఇంటి పక్కన నేనుండేవాణ్ణి మా ఇంటి ముందు పద్మనాభం ఇల్లు. అదో పెద్ద భవనం.. రేఖ అండ్ మురళి ఆర్ట్స్ సంస్థ. వచ్చిపోయే కళాకారులు, కథా చర్చలు, సంగీత సాధనాలు.. తెల్లారింది మొదలు రాత్రి పొద్దుపోయే వరకు పెళ్లింటి వాతావరణంలా కళకళలాడుతూ వుండేది. పద్మనాభం ఇంటికి కుడి పక్కన వల్లం నరసింహారావు, ఎడమపక్క సీతా నాగభూషణంలు ఉండేవారు. వల్లం కుమార్తె రేఖ, పద్మనాభం కుమారుడు మురళి. వీరి స్నేహానికి చిహ్నంగా రేఖ అండ్ మురళి ఆర్ట్స్ ప్రారంభించబడింది. ఉదయం ఫలహారాలు, మధ్యాహ్నం భోజనాలు, సాయంత్రం అల్పాహారం. గొప్ప వైవిధ్యంతో కొనసాగుతుండేవి. వీరితో పాటు కోదండ పాణి గారి కొడుకు సరదా మనిషి. నిత్యం నవ్వుల పువ్వులు పూసేవి. పద్మనాభం తొలి చిత్రం దేవత. ఎన్టీఆర్, సావిత్రి ప్రేమతో కాల్షీట్లు ఇచ్చారు. ఆ సినిమా సూపర్ హిట్ అయ్యింది. తర్వాతి చిత్రం పొట్టి ప్లీడరు హాస్యంతోపాటు క్రైమ్‌ని కూడా మేళవించి తీసిన చిత్రమిది. హిట్ అయ్యింది. ఆ తర్వాత చిత్రం శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న కథ (1967). ఈ చిత్రంతోనే ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం నేపథ్య గాయకుడిగా పరిచయమయ్యాడు. తొలిపాట 'ఆహా.. ఏమి ఈ వింత మోహం...'తో మంచి పేరు వచ్చింది. శ్రీరామకథ, కథానాయిక మొల్ల, జాతకరత్న, పెళ్లికాని తండ్రి చిత్రాలతో హిట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. కథానాయిక మొల్ల, పొట్టి ప్లీడరు, మర్యాదరామన్న, శ్రీరామ కథ చిత్రాలకు పద్మనాభమే దర్శకుడిగా వ్యవహరించి నంది అవార్డును కూడా కైవసం చేసుకున్నాడు. ఇవేకాక స్వచ్ఛంద సేవాసంస్థలు అందించిన అవార్డులకు కొదవలేదు.

మరపురాని పాత్ర

తన కెరీర్‌లో దేశ ద్రోహులు చిత్రంలో పిచ్చివాడి పాత్ర మరపురానిది అంటాడు. ఈ చిత్రంలోని 'ఆకలితో అన్నమడిగితే పిచ్చోడన్నారు నాయాళ్ళు, కడుపు మండి న్యాయం అడిగితే ఎర్రోడన్నారు నాయాళ్ళు..' అనే పాటని మరిచిపోలేం. పద్మనాభం నటనను మరిచిపోలేం.

నటనలో వైవిధ్యం

తెలుగు చిత్రాల్లో హాస్యం వెన్ను విరుచుకు తిరిగేలా చేసింది రేలంగి గారైతే.. ఆ హాస్యం పదింతలు ఎదిగి ప్రేక్షకుల్లో పెద్ద పీట వేసిన వ్యక్తిగా పద్మనాభాన్ని చూడవచ్చు. అంతగా నటనలో వైవిధ్యం పరితపించాడు. ఆహార్యం, వాచకం, అభినయం.. ఏ పాత్ర పోషించినా ఆ పాత్రకి సరికొత్త సొబగులు అద్దేవాడు పద్మనాభం. ఇందుకు ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల సహకారం జీవితాంతం మరువలేనిది. అలాగే తొలి రోజుల్లో తనను ప్రోత్సహించిన గూడవల్లి రామబ్రహ్మం, కె.వి.రెడ్డి, ఎల్వీ ప్రసాద్, పుల్లయ్య, ఆదుర్తి, విక్టరీలను మరిచిపోలేనంటాడు. పద్మనాభానికి ఎంతటి స్టార్‌డమ్ వచ్చినప్పటికీ సహచరుల్ని మరిచిపోలేదు. బాలక్రిష్ణ (అంజి) తదితర హాస్య బృందమంతా 'రేఖ అండ్ మురళి'లోనే కొలువు దీరేవారు. అందరూ ఒక కుటుంబంలా మసులుకునేవారు.

రంగస్థలం తల్లిగా

పద్మనాభం రంగస్థలాన్ని చూస్తే అపాదమస్తకం చలించుకుపోయేవాడు. మాతృమూర్తిని చూసిన భావన అతనిలో కలిగేది. చింతామణి, శ్రీకాళహస్తీశ్వర మహత్యం నాటకాలను రాష్ట్రమంతటా రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ వేల ప్రదర్శనలు ఇవ్వగలిగేవాడు. రఘురామయ్యని గురువుగా భావించిన పద్మనాభం పద్యాలు పాడటంలో ఆయన బాణీ అనుసరించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు కైవసం చేసుకునేవాడు. తన సంస్థలో పనిచేసే కళాకారులు ఎప్పుడెవరు అవసరం పడతారోనని భారీ మొత్తంలో డబ్బును వడ్డీలకు తెచ్చి నెల నెలా వారికి ఏ మాత్రం ఇబ్బంది రాకుండా చూసుకొనేవాడు. ఆశించిన మేరకు ప్రోగ్రామ్‌లు రాకపోతే తనలో తానే బాధపడేవాడు తప్ప తన సిబ్బందిని ఇబ్బంది పెట్టేవాడు కాదు. అంతటి మొహమాటస్తుడు, సున్నితమనస్కుడు.

అతినమ్మకం నట్టేట ముంచింది

పద్మనాభం స్నేహితుల కోసం ప్రాణం ఇచ్చేవాడు. ఒక రాత్రి ఫ్రెండ్స్‌తో మందు పార్టీలో ఉండగా దేవత, పొట్టిప్లీడరు, మర్యాద రామన్న, కథానాయిక మొల్ల, శ్రీరామకథ వంటి ఐదు సినిమాల మీద 99 ఏళ్ల నెగిటివ్ రైట్స్ రాసిచ్చేశాడు. కొంత కాలానికి ఏదో అవసరమొచ్చి దేవత సినిమా నెగిటివ్ రైట్స్ అమ్మాలనుకుంటే ఆ చిత్రాలన్నింటి మీద సర్వహక్కులు కోల్పోయాడని తెలుసుకున్నాడు. కష్టకాలంలో ఆదుకుంటాయని ఎన్టీఆర్‌తో బాటు కొన్న వజ్రాలను ఇంటి దొంగలే మాయం చేశారని తెలిసి కుదేలైపోయాడు. కన్ను తెరిచి మూసేలోగా దారిద్ర్యంలోకి నెట్టబడ్డాడు. సినిమాల్లో అవకాశాలు తగ్గాయి. ఆదాయం లేదు. ఆరోగ్యం క్షీణించింది. చాన్నాళ్లకు లైలా, చక్రం, భద్ర లాంటి సినిమాల్లో చిన్నచిన్న పాత్రలు పోషించినా ఎటూ చాలని పారితోషికమది. అలాగే లోలోపల కుంగిపోతూ, బాధతో తనలో తానే పాడుకుంటూ, పసిపిల్లాడిలా ఆడుకుంటూ 20 ఫిబ్రవరి 2010లో మరణించాడు. పద్మనాభం జీవితంలో చవిచూడని వైభవమూ లేదు. అనుభవించని అవమానాలు లేవు. ఎందుకంటే ఇది జీవితం!



ఇమంది రామారావు
9010133844

జేబు కింద జేబు

లియావో డెజాంగ్‌కు 80 ఏళ్లు. చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో కార్పెంటర్ పనిచేసిన ఆయన చేతిపనికి ఇప్పుడు బాగా పేరు వచ్చింది. వడ్రంగి వృత్తిలో కాదులెండి దుస్తుల డిజైన్‌లో. తనబోటి వృద్ధులకు నప్పేలా స్టైలుకు స్టైలు, యూజ్‌కు యూజ్ అయ్యేలా వస్త్రాలను రూపొందిస్తున్నాడు. ఇంటి తాళాలకో జేబు, పర్సుకో జేబు, ఫోన్‌కో జేబు, చిల్లరకో జేబు, ఇలా జేబు కింద జేబు కుట్టేసి తలనెరిసిన పెద్దలు ఏదీ పోగొట్టుకోకుండా రహస్యంగా జేబుల్ని అతికించేస్తున్నాడు. ఈ ఐడియా ఎలా మెరిసిందంటే ఓ రోజు ఆయన ఇంటికెళుతుండగా ఎవరో జేబుదొంగ ఫోన్ కొట్టేశాడు. వృద్ధుల నుంచి ఈజీగా జేబు కొట్టేయకుండా ఇలా డ్రస్సుల్ని కుట్టి మిత్రులకు అందిస్తున్నాడు. ఇప్పుడు ఏ జేబులో ఏముందో తెలీక అసలది ఎక్కడుందో కనుక్కోలేక ఆ ఊరి జేబు దొంగలు కత్తెరలు ముడుచుకుంటున్నారట.

వింత లోకం



ఆగవా ఇకనైనా...

చైనా వాసి హి గాన్హుయి 'ఫెన్సింగ్' అనే కత్తి సాము కోచ్. ఈయనకో గాళ్ ఫ్రెండ్ ఉంది. చీటికీ మాటికీ పేచీలు పెడుతుంది. 2012లో ఆమెతో పెద్ద గొడవ జరిగింది. ఆ బాధతో ఏం చేయాలో తోచక సైకిలెక్కి తొక్కడం మొదలెట్టాడు. ఎంత దూరమనేది చూసుకోలేదు. అది బాగా నచ్చి బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్ వరకు సైకిల్ ప్రయాణం కానిచ్చేస్తానని స్నేహితునికి ఫోన్ చేశాడు. విషయం తెలుసుకున్న గాళ్‌ఫ్రెండ్ 'కోపమా నా పైనా.. ఆగవా ఇకనైనా' అంటూ తనూ ఓ సైకిలేసుకుని వెంటపడింది. 2200 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కి ఇద్దరూ బీజింగ్ చేరాక ఒకరికోసం ఒకరున్నారని తెలుసుకున్నారు. ఏడాది తిరక్కుండానే మళ్లీ అదే గొడవ, అదే సైకిల్ శిక్ష రిపీటయ్యాయి. కానీ, ఈ సారి గాళ్‌ఫ్రెండ్‌ను తప్పించుకుని ప్రాణ మిత్రుడి పిక్కలకు కష్టం తెచ్చాడు. ఏకంగా ఆఫ్రికా వరకంటే అంతే కదా. అక్కడ జాంబియాలో దొంగలు సైకిల్, బ్యాక్‌ప్యాక్‌లు దోచుకునే వరకు సాగుతూనే ఉందా ప్రయాణం.

చేపల ముద్ర

గ్యోతాకు పేరు వింతగా ఉందా. ఈ ఆర్ట్ వేసే స్టయిల్ ఇంకా వింతగా ఉంటుంది. వందల ఏళ్ల క్రితం కెమెరాలు ఎక్కడున్నాయి. మరి చేప జాతుల వివరాలు తర్వాతి తరాలకు తెలిసేలా ఎలా చేయాలనేది జపాన్ జాలర్లకు ఎదురైన ప్రశ్న. మామూలు జాతులైతే పడవ దిగాక తీరిగ్గా చూపించొచ్చు. చాలా అరుదైనవి వలకు చిక్కితే అందరికీ తెలియజేయడమెలా? అందుకు వారో టెక్నిక్‌ను అభివృద్ధి చేశారు. దొరికిన చేపపై హానిలేని సుమీఈ అని ఇంక్ రుద్ది కాగితంపై ముద్ర వేసేవారు. తర్వాత వాటిని సముద్రంలో విడిచేసేవారు. ప్రింట్‌కు కళ్లలాంటి డిటెయిల్స్ జోడించి వాటి రంగుల్లో దిద్ది రికార్డు తయారుచేసేవారు. ఇదో కాలంలో లార్డ్ సకాయ్ ఈ ఆర్ట్‌ను బాగా ప్రోత్సహించాడు. ఆధునికత వచ్చాక సముద్రంలో కలిసిపోయిందనుకున్న ఈ ఆర్ట్ మళ్లీ అక్కడక్కడా తేలుతోంది.

యూరప్‌లోనే అతి ఎత్తైన పర్వతం ఎల్‌బ్రస్ (5642 మీ.)ను చకచకా ఎక్కేశాడు రష్యా పవర్ లిఫ్టర్ ఆండ్రీ రోడీచెవ్. పవర్ లిఫ్టర్ అంటున్నారు ఎక్కేయడా ఏంటి అనుకుంటే అతగాడి కష్టాన్ని చాలా చాలా తక్కువ చేయడమే. వ్యాయామశాలల్లో సాధన చేసే 75 కిలోల బార్‌బెల్‌ను మోస్తూ ఆండ్రీ ఎల్‌బ్రస్‌ను ఎక్కి కండ బలాన్ని ప్రదర్శించాడు. మామూలుగానే దాన్ని మోయడం చాలామంది జిమ్‌లకు వెళ్లేవారికే కష్టం. ఇదంతా కేవలం తన పాపులారిటీకే అనుకుంటే మరోసారి ఆండ్రీని తక్కువగా చేసినట్టే. తన సొంతూరు మురామాస్క్‌లో బాడీబిల్డింగ్‌పై ఆసక్తి, ప్రేరణ కలిగించేందుకు ఈ సాహసాన్ని భుజాన మోశాడు. ట్రెకింగ్‌ను, పవర్ లిఫ్టింగ్‌తో మిక్స్ చేసి అసాధ్యమైన ఫీట్ చేసిన ఆండ్రీకి పర్వతం మొత్తం ఎక్కడానికి నడుం విరిచే 8 రోజుల సమయం పట్టింది.

కొండంత బరువునెత్తి...

ఆలూతో ఆహా !

క్యారెట్ ఆలూ కూర్మా

కావాల్సిన పదార్థాలు

క్యారట్‌లు-4, బంగాళ దుంపలు-4, టమాటోలు-2, పచ్చి మిర్చి-2, అల్లం- చిన్న ముక్క, జీలకర్ర- ఒక స్పూన్, నూనె- మూడు స్పూన్లు,

మసాలాలకు

గరం మసాలా- ఆరు స్పూన్లు, ధనియాల పొడి-మూడు స్పూన్లు, కారం- ఒక స్పూన్, పసుపు-అర స్పూన్, ఉప్పు-తగినంత

తయారీ

క్యారట్ తొక్కు తీసి పొడుగ్గా ముక్కలు తరుక్కోవాలి. బంగాళ దుంపలు తొక్కు తీసి ముక్కలుగా తరగాలి. అల్లం టమాటోలు, పచ్చి మిర్చి కూడా ముక్కలుగా తరగాలి. బాణలిలో నూనె వేసి కాగాక జీలకర్ర వేసి అది వేగాక క్యారట్, ఆలూ, వేసి మూత పెట్టి సన్న సెగమీద వేగనివ్వాలి. గరం మసాలా, ధనియాల పొడి, కారం వేసి రెండు నిమిషాలు ఉంచి దించండి. హాట్ హాట్ ఆలూ కూర్మా రోటీతో తినడానికి రెడీ.

ఆలు ఫ్లవర్...

కావాల్సిన పదార్థాలు

ఆలు గడ్డలు-రెండు, పెరుగు-రెండు టేబుల్ స్పూన్లు, కారం-ఒక టీ స్పూను, ఉప్పు-తగినంత, ఆలివ్ ఆయిల్ -కొద్దిగా

తయారీ

ముందుగా ఆలుగడ్డపై పొట్టు తీసేసి రెండు ముక్కలు చేయాలి. ఆ ముక్కని ఒక చిన్న గిన్నెలో పెట్టి గులాబి పువ్వు మాదిరిగా సన్నని రేకులు కట్ చేసుకోవాలి. ఇప్పుడు చిన్న సైజు ఓవెన్ గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, కారం తగినంత ఉప్పు, ఆలివ్ ఒక టీ స్పూను ఆయిల్ వేసి బాగా కలపాలి. ఇందులో పువ్వులా కట్ చేసిన ఆలుగడ్డ ముక్కని పెట్టి ఓవెన్‌లో బేక్ చేయాలి. ఆలుగడ్డ రేకులు ఎర్రగా అవ్వకపోతే మరి కాసేపు బేక్ చేసుకోవాలి. ఇలా అన్ని ముక్కల్ని చేసుకోవాలి. వీటిని టమోటాసాస్‌తో కలిపి పెడితే పిల్లలు ఇష్టంగా తింటారు.

ఆలు బోండా చిప్స్

కావాల్సిన పదార్థాలు

ఆలు గడ్డలు (చిన్నవి) - ఐదు , క్యారెట్లు- రెండు, క్యాలీఫ్లవర్ ముక్కలు- అర కప్పు, బీన్స్ ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయలు-రెండు, పచ్చి మిరపకాయలు-మూడు, గరం మసాలా- అర టీ స్పూను, అల్లం వెల్లుల్లి ముద్ద-ఒక టీ స్పూను, కొత్తిమీర- ఒక కట్ట, శెనగపిండి-పావు కిలో, మొక్కజొన్న పిండి-ఒక టేబుల్ స్పూను, కారం -ఒక టీ స్పూను, ధనియాల పొడి-ఒక టీ స్పూను, ఉప్పు-తగినంత, నూనె-సరిపడా

తయారీ

పొట్టు తీయకుండానే ఆలుగడ్డల్ని ఉడికించి పెట్టుకోవాలి. తర్వాత పొయ్యి మీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక ఉల్లిపాయ ముక్కలు , పచ్చి మిరపకాయ వేగించాలి. తర్వాత క్యారెట్ ముక్కలు, క్యాలీఫ్లవర్ ముక్కలు , బీన్స్ ముక్కలు వేయాలి. ఉప్పు కూడా వేసి బాగా కలిపి సన్నని మంటపై మగ్గనివ్వాలి. ముక్కలు బాగా మెత్తపడ్డాక గరం మసాలా వేసి బాగా కలిపి దించేయాలి. ఇప్పుడు ఉడికించిన ఆలుగడ్డ తీసుకుని మధ్యలో రంధ్రం చేసి అందులో ఈ కూర పెట్టి పైన ఆలుగడ్డ గుజ్జుతో మూసేయాలి. ఇలా అన్నింటిని చేశాక ఒక గిన్నెలో శెనగపిండి, మొక్క జొన్న పిండి, ఉప్పు, కారం, అల్లంవెల్లుల్లి ముద్ద సరిపడా నీళ్లు పోసి బజ్జీ పిండి కలుపుకోవాలి. ఇందులో ఉడికించిన బంగాళ దుంపలు ముంచి బజ్జీలుగా వేసుకోవాలి. బంగారు రంగు వచ్చాక తీసేసి చాకుతో బజ్జీలను సన్న చక్రాలుగా కట్ చేసుకుని తినాలి.

ఆలు గోబీ పులావ్

కావాల్సిన పదార్థాలు

బంగాళ దుంప ముక్కలు-3/4 కేజీ, క్యాలీఫ్లవర్(విడిపించుకొన్నవి)-ఒకటి, బాస్మతి రైస్: మూడు కప్పులు, నెయ్యి-రెండు స్పూన్లు, చెక్క: ఒకటి, లవంగాలు: ఐదు, బిర్యానీ ఆకులు-రెండు, పసుపు: 1/2 స్పూన్, కారం: స్పూన్, ఉప్పు: రుచికి సరిపడా, నూనె- తగినంత

తయారీ

ముందుగా ప్రెజర్ కుక్కర్‌లో నెయ్యి వేసి వేడి చేయాలి. అందులో ఇప్పుడు చెక్క లవంగాలు, బిర్యానీ ఆకు వేసి తక్కువ మంట మీద కొన్ని నిమిషాల పాటు వేయించుకోవాలి. ఇప్పుడు అందులోనే శుభ్రం చేసి కడిగి పెట్టుకున్న బియ్యాన్ని వేసి మరో రెండు నిమిషాలు వేగించుకోవాలి. తర్వాత అందులోనే క్యాలీఫ్లవర్, బంగాళ దుంప, బియ్యం, పసుపు, కారం మరియు ఉప్పు అన్నీ వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. అన్నీ వేగాక అందులో మూడున్నర కప్పుల నీళ్ల పోసి బాగా కలపాలి. ఇప్పుడు మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత స్టౌ ఆఫ్ చేసి పది నిమిషాలు అలాగే ఉంచి ఆ తర్వాత మూత తియ్యాలి. అంతే ఆలూ గోబీ పులావ్ రెడీ.



బాలయ్య కోపం

- ఎస్. వినయకుమార్
సెల్ : 9989718311

ఎవరో తరుముకొస్తున్నట్లు సెలూన్‌లోకి అడుగు పెట్టాడు బాలయ్య. రాగానే "జల్ది కానీ మడిగె మూసి బయటికెళ్లాలె" అంటూ కొడుకును తొందరపెట్టారు.

అప్పుడే గడ్డానికి రెండోసారి సబ్బు వేసి ఎదురు గీకడం మొదలెట్టిన సవారి తలెత్తి తండ్రివైపు చూశాడు. "అయిపోవచ్చింది గానీ యాడికోవాలె. ఎందుకంత తొందర" అంటూ అడిగాడు.

బాలయ్య సమాధానం చెప్పకుండా మేజామీద ఉన్న కత్తుల్లోంచి తెలుగు కత్తులు ఏరి పక్కకు పెట్టాడు. సానెకు పోయొచ్చిన తెలుగు కత్తులను కప్‌బోర్డులోంచి తీసి కళ్లకు దగ్గరగా పెట్టుకొని పరిశీలనగా చూశాడు. "పువ్వు అట్లనే ఉంది నూరలేదా" అని అడిగాడు.తండ్రి ప్రశ్నకు జవాబు చెప్పకుండానే 'యాడ్నించి వస్తున్నవు: అదెన్న చెప్పు' చిరాకు చూపాడు సవారి.

"దవాఖానా కెళ్లి వస్తున్న. డాక్టర్ సాబ్ పిల్వనంపి పనిచ్చిండు. జల్ది కానీ" అన్నాడు బాలయ్య.

డాక్టర్ పిలవనంపిండు అంటాడు. తెలుగు కత్తులను ఏరి పక్కన పెడ్తున్నడు. విషయం అర్థమయింది. అయిష్టంగా మొహం పెట్టాడు. క్షురకులు మాత్రమే ఇంగ్లీషు కత్తిని తేలిగ్గా వాడగలరు. ఇతరులు తమను తాము శుభ్రం చేసుకోవడానికి తెలుగు కత్తుల్ని తీసుకెళ్లి తిరిగి తెచ్చిస్తుంటారు. ఎంత గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్తుంటారో అంత గుట్టుగా తిరిగి తెచ్చిస్తుంటారు. కనుక డాక్టర్ పిలువనంపి ఇచ్చిన పనేంటో సవారికి అర్థమయింది.

కొడుకు ముఖకవళికలను గమనించాడు బాలయ్య. అయినా పట్టించుకోకుండా ఏరి పెట్టుకొన్న కత్తులను నూరడం మొదలెట్టాడు. కత్తి నూరే రాయిని అరచేతిలోకి తీసుకొని దానిమీద ఒక చుక్క నూనె వేశాడు. ఆపై నూరిన కత్తులను మేజా పక్కన గోడకు వేలాడ దీసిన తోలుపట్టాపై కిందికి పైకి ఆడించాడు. ఒక్కొక్క కత్తిని తీసుకొని బొటనవేలు గోరుపై ఆనించి ధారను పరిశీలించాడు.

ఓ తుండుగుడ్డను నిలువుగా నాలుగు మడతలు వేసి మేజాబల్లపై పరిచాడు. గుడ్డపై ఒక కత్తిని పెట్టి రెండుసార్లు మడత పెట్టాడు. ఆపై మరో కత్తి మళ్లీ రెండు మడతలు, అలా కత్తులన్నీ ఒకటి తర్వాత ఒకటిగా గుడ్డలో చుట్టేసి జాగ్రతగా ఒక చేతి సంచిలో పెట్టాడు. కత్తులు పెట్టడానికి ముందే కత్తులు నూరే రాయితో పాటు చిన్న కొబ్బరి నూనె సీసా సంచిలో పెట్టాడు.

ఈ లోగా సవారి రెండోసారి గీకడం ముగించి పంపుతో మొహానికి నీళ్లు కొట్టాడు. మదనమస్తు పువ్వు రెమ్మలు రెండు పంపు సీసాలో వేసి ఉండటం వల్ల దుకాణమంతా సువాసన గుప్పుమంది. కస్టమర్ కళ్లు తెరిచి ఆశ్చర్యంగా చూశాడు. తన్మయుడైనట్లు మళ్లీ కళ్లు మూసుకొన్నాడు.

కస్టమర్ ఎద మీద కప్పిన తువ్వాలుతో మొహం తుడిచేసి స్నో పూసి పౌడర్ వేశాడు సవారి. "కండ్లకు సుర్మా పెట్టనా సల్లగుంటది" అంటూ నగిషీలు చెక్కిన చిన్న రాగివెండి భరిణ లాంటిది చేతుల్లోకి తీసుకొన్నాడు. అదేమిటో తెలియక పోయినా తల అడ్డంగా తిప్పాడు కస్టమర్. తెలుగు కత్తిపిడితో గుండ్రటి కుంకుమ బొట్టు పెట్టి తల దువ్వాడు సవారి.

అప్పటికి గానీ కళ్లు తెరవని కస్టమర్ అద్దంలో తన మొహం చూసుకొని సంబరపడిపోయాడు. సోకు చేసుకొంటే తాను కూడా అందగాడినే అనుకొని పొంగిపోయాడు. అద్దం ముందు రకరకాల భంగిమలు పెట్టి తనను తాను తనవి తీరా చూసుకొంటూ మీసం దగ్గర చేయివేసి సరిచేయమన్నట్లు సైగ చేశాడు.

అంతా బాగానే ఉన్నా అలా ఏదో ఒకటి చెప్పడం కస్టమర్లకు అలవాటే కనుక మడచి పెట్టిన ఇంగ్లీషు కత్తిని తీసుకొని ఒక్క వెంట్రుకను కూడా ముట్టకుండానే ఏదో సరిచేసినట్లు నటించాడు సవారి. చివరికి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తలాడించి బనియన్‌తోపాటు ఆఫారం పైకెత్తి చంకలు



చూపెట్టాడు కస్టమర్. తెలుగు కత్తితో చంకలు కూడా శుభ్రం చేశాడు సవారి. అయినా కుర్చీ దిగకుండా అద్దంలో తన అందం చూసి మురిసి పోతున్నాడు కస్టమర్.

షాపు మూసేసి బయటికి వెళ్లాలన్న తొందర్లో ఉన్న బాలయ్యకు కస్టమర్‌పై చిర్రెత్తుకొచ్చింది. "ఆడదాన్ని చూసినా అద్దాన్ని చూసినా బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు అని పెద్దలు ఊర్కనే అనలేదు" అంటూ గొణిగాడు. కస్టమర్ ఈ మాటలేవీ పట్టించుకొనే స్థితిలో లేడు. ఆ జేబు ఈ జేబు వెతికి ఓ బేడ బిళ్ల తీసి మేజాపై పెట్టాడు. "బ్యాడకు గడ్డం చేసేకాలం ఎప్పుడోపోయింది. చారానా ఇవ్వు" అన్నాడు సవారి. అయిష్టంగానే అయినా మారు మాట్లాడకుండా మరో బేడ ఇచ్చేసి కస్టమర్ వెళ్లిపోయాడు.

కస్టమర్ వెళ్లాక నోరు విప్పాడు బాలయ్య. "ఈరోజు పిల్లలు పుట్టకుండా మగోల్లకు ఆపరేషన్లు చేస్తరంట కనీసం వంద మందికయినా ఆపరేషన్లు చేస్తరంట. ఆపరేషన్‌కు ముందు ఎవరికి వాళ్లు శుభ్రం చేసుకోవాలంట. దానికి మనం కత్తి నూరివ్వాలి. మనిషికి పదహైదు పైసల చొప్పున ఇస్తామని డాక్టర్ సాబ్ చెప్పిండు. అంటే ఒక్కరోజులో కమ్సేకమ్ పదహైదు రూపాయిలు వస్తయి. అందుకే కత్తులు నూరి పెట్టిన. చేతులు కడుక్కో దుక్నం తాళం వేసేద్దాం" అంటూ తొందర పెట్టాడు బాలయ్య.

సవారికి ఒక్కసారిగా కోపం నషాళానికి అంటుకొంది. "అంటే మనం దవఖానా ముందర రోడ్డు మీద కూసొని కత్తులు నూరి ఇవ్వాల. బేకార్ పని ఒప్పుకొచ్చినవు. డాక్టర్ సాబ్ చెప్పిండు కదాని ఇజ్జత్ లేని పని చేస్తామా? కటింగ్ చేసుకొన్నంక ఎవరైనా కత్తి అడిగి తీసుకెళ్తే అది వేరు. దాని కోసం అంగడి పెట్టుకొంటామా" రుసరుసలాడాడు.

పొంగుకొచ్చిన ఉత్సాహం మీద నీళ్లు పోసినట్లనిపించింది బాలయ్యకు. ఒక్క రోజులో పదహైదు రూపాయలు వస్తాయి. దుక్నంల నాలుగైదు రోజులయినా అన్ని పైసలొస్తయని గ్యారంటీ లేదని అనుకొన్న గాని ఇంతదూరం ఆలోచించలేకపోయానే అని అన్పించింది. కొడుకు చెప్పేమాట నిజమే కదా అని మనుసులోనే అనుకొన్నడు. కాని ఇప్పుడు చేసేదేమీలేదు.

డాక్టర్ సాబ్ ఖుద్ పిలిపిచ్చి మాట్లాడిండు. తాను ఒప్పేసుకొన్న. మెత్తబడినట్లు కన్పిస్తే కొడుకు మరింత రెచ్చిపోతాడేమో. కనుక వాదనకు దిగకుండా సవారిని బలవంతంగా నయినా తీసుకెళ్లాల్సిందే అని అనుకొన్నాడు బాలయ్య.

"ఇందులో ఇజ్జత్ పోనీకె ఏముంది. మనమేమన్న గొరుగుతమా కత్తి నూరియ్యాలె అంతే, షాపుల ఇయ్యమా. ఆడ గూడా గంతే. మనం కత్తులు ఇస్తేనే ఆడ ఆపరేషన్లు షురు అయితయి. దుక్నం తాలమేసి రా". దవాఖాన్ల కాదు ఊరుబైట క్యాంపు పెట్టిండ్రు, 'ఆడ చేస్తరు ఆపరేషన్లు నీవేం పరేషాన్ కాకు' అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా సంచి తీసుకొని రోడ్డుమీదికి వచ్చేశాడు బాలయ్య. చేసేదేమీలేక కుతకుతలాడుతూనే తండ్రి వెనుక బయల్దేరాడు సవారి.

క్యాంపు దగ్గర వార్డుబాయి బాలస్వామి చూపెట్టిన చోట రెండు ఇటుక రాళ్లు వేసుకొని, భుజం మీదున్న తువాలు వాటిమీద పర్చుకొని కూర్చున్నాడు బాలయ్య. గోనెతట్టు ఒకటి సంపాదించుకొని పరిచి కూచున్నాడు సవారి. సంచిలోంచి రాయి, నూనె సీసా, కత్తుల మూట తీశాడు. ఖాళీ చేసిన సంచి మీదే జాగ్రత్తగా కత్తులు పెట్టుకొన్నాడు.

ఎలా తరలించారో గానీ పల్లెల్నించి జనం బాగానే వస్తున్నారు. నడి వయసులో ఉన్న వారే కాదు. ముసలి ముతకా కూడా వస్తున్నారు. బాలస్వామి మరోసారి వచ్చాడు. "డాక్టర్లు వచ్చేసింగ్రు. ఆపరేషన్లు షురూ అయితయి. మీరు రెడీయే కదా? నేను చీటీ రాసి పంపినోళ్లకు కత్తులిచ్చి పంపండి" అని ఆర్డర్ వేసి హడావిడిగా వెళ్లిపోయాడు. జనం చీటీలు తీసుకొని రావడం మొదలైంది. నూరిన కత్తుల్ని బాలయ్య, సవారి వాళ్ల చేతుల్లో జాగ్రత్తగా పెడుతున్నారు. పని అయిపోయాక కత్తులు ఇచ్చేసి ఆపరేషన్ల కాంప్ వైపు వెళ్లిపోతున్నారు జనం.

జనం బాగానే వస్తున్నారు. డాక్టర్ సాబ్ చెప్పినట్లు వందమందికి తక్కువ కారు. అయితే గియితే కొంచెం ఎక్కువే కావచ్చు. అంటే పొద్దుగూకేటప్పటికి జేబులో పదహైదు రూపాయలుంటాయి. ఖుషీ అన్పించింది బాలయ్యకు. వెంటనే మనసు కల్లు మీదికి మళ్లింది. కల్లు తాగి ఎన్నాళ్లయిందో. ఇంటికి పోయేటప్పుడు కల్లుదుక్నం మీద పోవాలి. రెండు సీసాలయినా తాగాలి అని నిర్ణయించుకొన్నాడు. ఇంతలోనే భార్య గుర్తు కొచ్చింది. తనకు కల్లు తాపి నెలలయిపోయినయి. ఒక సీసా కల్లు దుక్నంల తాగి రెండు సీసాలు ఇంటికి తీసుకెళ్లాలి. ఈడిగాయన తన తానికే సౌరానికొస్తడు. కాకా.... కాక అని వరుస పెట్టి పిలుస్తడు. ఖాళీ సీసాలు రేపు తెచ్చిస్తనంటే తప్పక ఒప్పుకొంటాడు. ఈ ఆలోచనతో బాలయ్య మనసు మరింత ఖుషీ అయింది.

ఒట్టి కల్లు తీసుకపోతే ఎలా అణా పెట్టి అనప గుగ్గిల్లు కూడా తీసుకెళ్లాలె. పదహైదు రుపాయలు వస్తుంటే ఛా గుగ్గిళ్లేం కర్మ. చారానా పెట్టి నల్ల తీసుకెళ్లాలి, అని నిర్ణయించుకొన్నాడు. యాటరక్తంతో –పొట్ట పేగులు పచ్చిమిరపకాయలు, మసాలాలు వేసి తయారు చేసే నల్ల యాదికి రాగానే నోట్లో నీళ్లూరాయి బాలయ్యకు. చారానాది ఏం సరిపోతది. సవారి ఉన్నడు. ఇంట్లో చిన్నోడున్నడు. నీయమ్మ...అయితే అయింది. ఎప్పుడు బడితే అప్పుడు తింటమా. ఆటాన నల్ల తీసుకపోవాలె. నల్లను చూడగానే అందరు మస్తు కుశౌతరు. తన ఆలోచనలకు తానే పొంగిపోయాడు బాలయ్య. ఓరకంటితో కొడుకువైపు చూశాడు. అరచేయిలో రాయిపెట్టుకొని సవారి కత్తి నూరుతున్నాడు. అమ్మయ్య కొంచెం కోపం తగ్గినట్లుంది అని అనుకొన్నాడు.

ఎనిమిదో తరగతి చదివేటోన్ని సాలె మాన్పించి పనిలో పెట్టిన. ఇస్కూల్ దోస్తులెవరయిన తనను ఇక్కడ చూస్తరేమోనని భయపడ్తున్నడు బిడ్డ. వాని భయం కూడా వాజిబే... కాని ఏం చేస్తం. పని చేసుకోకపోతే పొట్ట గడవొద్దు. ఒక్క రోజుకు పదహైదు రుపాయలు వస్తుంటే ఎందుకొదులుకోవాలె. తన నిర్ణయాన్ని మనసులోనే గట్టిగా సమర్థించుకొన్నాడు బాలయ్య.

దూరం నుండి ఐస్‌ఫ్రూట్ బండి కేక విన్పడింది. "లాల్ పీలా లష్కర్ వాలా.....నోటికీ తియ్యగా... ప్రాణంకీ సల్లగా" అని పాడుకొంటూ తోపుడు బండి నెట్టుకొస్తున్నాడు అరబ్బాయన. తోపుడు బండి మీద

పెద్ద ఐస్‌గడ్డ. దాని పక్కన చిన్న చిన్న పింగాణీ జాడీల్లో ఎరుపు, పచ్చ, ఆకుపచ్చ రంగుల్లో చిక్కటి చక్కర నీళ్లున్నాయి. ఐస్‌గడ్డను తోప్డా పట్టి, అరచేతిలోకి వచ్చిన పొడి ఐస్‌కు పుల్లను ఉండగా చుట్టి, ఉండను ఏదో ఒక జాడీలో ముంచి ఇస్తుంటాడు. ఎండాకాలం మాత్రమే ఊళ్లో ఈ వ్యాపారం చేస్తుంటాడు. మిగతా కాలాల్లో హైదరాబాదు వెళ్లిపోయి బతుకుతుంటాడు. వచ్చీరాని తెలుగులో ఐస్‌ఫ్రూట్ వ్యాపారం చేస్తుంటాడు. బండి తోస్తూ మూడు చరణాల పాటనే ఆగాగి పాడుతుంటాడు. ఐస్‌ఫ్రూట్ మహిమనో, పాట మహిమనో గానీ పిల్లలు బండి చుట్టూ కొన్నా కొనకున్నా చేరుతారు. సాగనంపుతున్నట్లు కొంత దూరమైనా బండి వెంట నడుస్తారు.

దగ్గరకొచ్చాక బాలయ్యను గమనించిన అరబ్బాయన "ఆదాబ్ బాలయ్య మహారాజ్" అని పలకరించాడు.

'ఆదాబ్ చావూష్... ! కైసేహో. దందా కైసా చెల్రా' బాలయ్య ప్రతిస్పందిస్తూ కుశల ప్రశ్నలు వేశాడు.

"అల్లాకే ఫజల్‌సే అచ్ఛాహు ! గర్మీకా మౌసం అభీతో షురూ హువా. అగే ఆగే దేఖ్నా ఏసాల్ దందా కైసా చల్తాకీ. ఆప్ దుకాణ్ బంద్ కర్కే ఇదర్ ఆగయే క్యా... పేట్ కేలియే క్యా కుచ్ నహీ కర్నా పడ్తా" అన్నాడు చావూష్. చావూష్ మాటల్లో సానుభూతి ధ్వనించింది.

చావూష్ సానుభూతి స్వరం బాలయ్యను ఇబ్బంది పెట్టింది. మాటలు పొడిగించడం ఇష్టం లేక హౌ హౌ అని ముక్తసరిగా మాట్లాడి పనిలో బిజీగా ఉన్నట్లు నటించాడు. "లాల్ పీలా లష్కర్‌వాలా నోటీకి తియ్యగా, ప్రాణంకీ సల్లగా" అని పాడుకొంటూ ముందుకెళ్లాడు చావూస్.

చావూష్ గొంతులో ఏదో అపస్వరం విన్పించింది సవారికి. ఈ అరబ్బోడు ఊర్లోకెళ్లి అందరికీ టాంటాం వేయడుకదా. బండి తోసుకొంటూ ఐస్‌ఫ్రూట్ వాడే ఇక్కడికి వచ్చాడంటే బుడ్డీల బుట్టతో సాయిలు, సోడాబండి బాబుమియా రాకుండా ఉంటారా. కత్తులు తీసుకెళ్తున్న వాళ్లంతా చుట్టుపక్కల పల్లెలవాళ్లు కనుక ఏం పర్వాలేదు. కాని ఊళ్లో వాళ్లు చూస్తే ఎక్కిరించకుండా ఉంటారా! సవారి కంగారు పడ్డాడు. కంగారును దాచిపెట్టుకొని " ఇంతమందికి కత్తులు ఇచ్చి పంపుతున్నం కదా. అన్నీ తిరిగొస్తాయంటావా" అని తండ్రి ప్రశ్నించాడు. బేకారు పని ఒప్పుకొచ్చినవు అని తండ్రిచేత అన్పించాలని సవారి తాపత్రయం.

చిన్న నవ్వు నవ్వాడు బాలయ్య "కత్తి తీసుకెళ్లి ఎవడైన ఏం చేస్తారు. ప్రతిసారి దాన్ని నూరుకోవాలాయె. మంగలి కత్తి నూరే వడుపు ఎవరికుంటది. మన కత్తులు నూరే రాళ్లు ఎవరి దగ్గరుంటయి. వాళ్ల ఊర్లో మంగలి దక్కరికెళ్తేనేమో దొంగతనం బైటపడ్తది. చుట్టుపక్క ఊళ్లల్ల మంగలోల్లంతా మన చుట్టాలేనాయే" భరోసాగా చెప్పాడు. బాలయ్యదే పైచేయి అయింది.

వార్డుబాయి బాలస్వామి మళ్లీ వచ్చాడు. "డాక్టర్లు అన్నాలకెళ్లిండ్రు. ఒక గంట తర్వాత మళ్లీ పని మొదలెడ్తరు. మీరు కూడా ఏదన్న తిన్రండి" అని చెప్పాడు.

సరేనంటూ బాలయ్య తలూపాడు. పైసలకు సాయంత్రం డాక్టర్ సాబ్‌ను కలవనా, కాంపౌండర్ సాబ్‌వు. నీవే ఇస్తవా' అని అడిగాడు.

జనమంతా తనను కాంపౌండర్ సాబ్ అనుకోవాలని బాలస్వామికి వాంఛ. కాంపౌండర్‌కు వార్డుబాయికి తేడా తెలవని వాడు బాలయ్య. ఏదైతే నేం బాలస్వామి మహదానంద పడిపోయాడు.

"ఇదేమన్న నీ దుక్నం అనుకొన్నవా చిచా. సర్కార్ పని. డాక్టర్ సాబ్ బిల్లు చేసి మయబ్‌నగర్ పంపాలె. అక్కడ బిల్లు పాస్ గావాలె. ఆ పైసల్ డాక్టర్ సాబ్‌కు రావాలె. డాక్టర్ సాబ్ నిన్ను పిలిచి పైసలిప్పించి దస్కకత్ పెట్టించుకోవాలె. దీని కంతటికి కమ్సే కమ్ రెండు వారాలయిన పట్టయి.

నీవేం ఫికర్ చేయకు. ఇది సర్కార్ పని పైసలు యాడికి పోవు. ఒకవారం అటు ఒక వారం ఇటు. అంతే". కాంపౌండర్ మాటల్తో బాలయ్య గుండెల్లో రాయి పడింది. సవారి తలెత్తి తండ్రి దిక్కు సురసుర చూశాడు.

"ఈరోజు దుక్నం బంద్ పెడ్తి. రేపటి సాదార ఖర్చుల కన్నా పైసలు గావాలెగదా"! బేలగా అడిగాడు బాలయ్య.

తనను కాంపౌండర్ సాబ్ అని పిల్చిన బాలయ్య మీద బాలస్వామికి ఎక్కడలేని దయ పుట్టుకొచ్చింది. "ఎహె....దిగులు పడకె చిచ. నిన్ను ఉపాసం పండనిస్తన. రెండు రూపాయలు బదులిస్త. నీకు పైసలొచ్చినంక ఇయ్యి" అంటూ రెండు రూపాయల నోటు బాలయ్య చేతుల్లో పెట్టి వెళ్లిపోయాడు.

"ఎకాఎకిన వస్తిమాయె. ఇంటికి పోయిరానికె టైం లేదు. కాంప్ దగ్గర చాయ్ దుక్నం పెట్టినట్టున్నరు. ఆడికి పోయి చూద్దమా" బాలయ్య ప్రశ్నకు తలూపాడు ఆకలితో ఉన్న సవారి.

చాయి దుక్నంల చాయ్, బన్ను తప్ప మరేమీ లేవు. "రెండు దబల్ రొటెల్లు, రెండు చాయలు" అంటూ ఆర్డర్ వేశాడు బాలయ్య.

చాయిలో అద్దుకొని ఒక బన్ను తినేశాడు బాలయ్య. ఆకలి తీరలేదు. మరో దబల్ రొట్టె అడుగుదామనుకొన్నాడు. దాని కోసం మరో అణా పెట్టడం ఎందుకని ఊరుకొన్నాడు. కొడుక్కి మాత్రం మరో బన్ ఇప్పించాడు. చాయిలో అద్దుకోకుండానే గబాగబా ముందరి పళ్లతో పీక్కుని రెండు బన్నులను రెండు నిమిషాల్లో నమిలేశాడు సవారి. రెండు గుటకల్లో గ్లాసులోని చాయ్‌ను కడుపులో పోసుకొన్నాడు. అంతకుమించి ఇప్పించడానికి తండ్రి సిద్ధంగా లేడని అర్థమయింది. నిట్టూర్పుతో చాయ్ దుక్నం నుండి బయటికొచ్చాడు.

కొడుకును వెంటబెట్టుకొని తాము కూర్చున్న చోటుకు వచ్చేశాడు బాలయ్య. జేబులోంచి బీడికట్ట తీశాడు. రెండు చేతుల మధ్య సున్నితంగా కట్టను నలిపి ఒక బీడి బైటికి లాగాడు. దగ్గర్లో కన్పించిన వాడిని నిప్పు అడిగి బీడి వెలిగించాడు. రెండు దమ్ములు లాగాడో లేదో తన ముందు దారికవతల హడావిడి మొదలైంది. దొర మనుషులు ప్రత్యక్షమయ్యారు. దొర మనషుల్లో ఒకడు తాను మోసుకొస్తున్న ఇనుప కుర్చీ మడత విప్పి నేలపై పెట్టాడు. మరొకడు భుజం మీద ఉన్న తుండుతో కుర్చీపై లేని దుమ్మును దులిపాడు. దొర విలాసంగా వచ్చి కుర్చీలో సెటిలయ్యాడు. దొర వెనుక ఆయన మనుషులు వినయంగా నిలబడ్డారు.

దూరం నుండే దొరను గమనించిన బాలయ్య చేతుల్లోని బీడి విసిరేసి లేచి నిలబడ్డాడు. "దండాలు దొర" అంటూ రెండు చేతులు పబ్బుతి పట్టి కాస్త ముందుకు వంగి నమస్కరించారు. దొర ప్రతి నమస్కారం చేయకుండానే కూర్చొని నీపని నీవు చేసుకో అన్నట్లు దర్పం చూపెడ్తూ సైగ చేశాడు.

తాను కూడా లేచి నమస్కరించాలా! వద్దా! తేల్చుకోలేక పోయిన సవారి, తండ్రి కూర్చోవడంతో నిలబడి నమస్కరించే ఆలోచన మానుకొని కత్తి నూరే రాయిని చేతిలోకి తీసుకొన్నాడు.

కొద్దోగొప్పో చదువుకొన్నాడు కనుక సవారి ఆలోచనలో పడ్డాడు. ఈ దొరకు ఇక్కడేమి పని. ఆయన వాలకం చూస్తే ఆపరేషన్‌కని వచ్చినట్లు లేదు. సర్కారీ పనుల్లో పెత్తనం చేయాలంటే లోపలికెళ్లి డాక్టర్ల మీద దవఖానాలో పని చేసేవాళ్ల మీద చేయాలి. ఇక్కడికెందుకొచ్చినట్లు. ఆపరేషన్లు

చేయించుకొనే వారి ముందు దర్పం చూపెట్టడానికా...! మనసులోనే ఈసడించుకొన్నాడు.

రాజుగారి దగ్గర పెద్ద పాలేరు లాంటివాడు ఈ దొర. సంస్థానం పోయింది. రాజరికం పోయింది. రాజు మిగిలాడు. ఆయన భూములు ఆయనకే మిగిలాయి. రాజుగారు హైదరాబాదులోనే ఉంటాడు. భూములు, ఆదాయం చూసుకోవడానికి అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడు. రాజుగారి భూముల వ్యవహారం చూస్తే దొర మాత్రం ఆ చుట్టు పక్కల జరిగే సర్కారీ పనులన్నీ రాజుగారి దయా దాక్షిణ్యాల మీద జరుగుతున్నట్లు పోజిస్తుంటాడు. ఎవరు పిలిచినా పిలవకపోయినా సర్కారీ పనులు జరిగే చోట్లకు తన అనుచరులతో వెళ్లి కొద్దిసేపు అక్కడ గడిపి, వాడిని వీడిని గదమాయించి వస్తుంటాడు. ఎప్పుడూ నలగని తెల్లని ఖద్దరు బట్టల్లో మిలమిల మెరిసిపోతుంటాడు. మూతిమీద మీసాలు, చెవుల్లో వెంట్రుకలు పోటీపడి పెరిగినట్లుంటాడు.

సవారి ముఖ కవళికల్ని బట్టి వాడి ఆలోచనలను సులభంగానే గమనించాడు దొర. వచ్చిపోయే వాళ్ళ వంగొంగి పెడ్తున్న దండాలను అందుకొంటూనే సవారిని, బాలయ్యను ఎలా ఆటబట్టించాలని ఆలోచించాడు.

"ఏం బాలయ్య! బాగున్నవా. దుక్నం పెట్టినవంట గద. మరి ఈడికెందుకు వచ్చినవు" అని అడిగాడు.

"దుక్నం కాడికి వచ్చి కత్తులు తీస్కపోవాలంటే లేటయితది. ఈడికే వచ్చి కత్తులు నూరియ్యమని డాక్టర్ సాబ్ చెప్పిండు దొరా" అని సమాధానమించిండు బాలయ్య.

'నీ కొడుకా.... చదువుకొన్నడా?' ప్రశ్నించాడు దొర.

దొర ప్రశ్నల్లో ఏదో ఆపద శంకించాడు బాలయ్య. దొర తానుగా మాట కలుపుడెందుకు! కొడుకు చదువు మాటెత్తడం ఎందుకు! వీడేమో లేచి దండం కూడా పెట్టడయ్యే.... గుబులెత్తాడు బాలయ్య.

"అది సరే గానీ...ఎవడైన వస్తే కత్తి నూరిస్తవు. లేదంటే మట్టసంగ కూసుంటవు. నీవు, నీ కొడుకు రెండు కత్తులు పట్టుకొని ఓ ఇద్దరిని తగులుకోవచ్చు గదా". తాను విసిరిన మాట సవారికి సూటిగా తగిలిందా లేదా అన్నట్లు పరికించి చూశాడు దొర.

దొర అపహాస్యానికి ఆయన అనుచరులు పడిపడి నవ్వారు. దొర చెప్పినట్లు చేయరాదె పెద్ద మనిషి అంటూ దొర అనుచరులు మరింత ఆటపట్టించేందుకు పూనుకొన్నారు. అవమాన భారంతో తలెత్తాడు బాలయ్య. నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు. బేలగా దొరవైపు ఆయన అనుచరులవైపు చూసి తలదించుకొన్నాడు.

సవారి కుతకుతలాడిపోయాడు. దొరమీద, ఆయన వెంట ఉన్నవారి మీద కోపం పొంగుకొచ్చింది. అంతలోనే ఆ కోపం తండ్రి వైపు మళ్లింది. చేతిలో కత్తినేలపై పెట్టి దూరంగా వెళ్లాడు సవారి.

"యాడికెల్తవురా బాడ్కావ్" అంటూ దొరకు సమాధానం చెప్పలేని నిస్సహాయత కొడుకుపై కోపంగా పొడుచుకొచ్చింది. దాంతో నోరు జారాడు. అనరాని మాట అన్నాడు బాలయ్య.

తండ్రి మాటలు సవారిని మరింత రెచ్చగొట్టాయి. పట్టరాని కోపంతో చేతికందిన ఇటుక బెడ్డ తీసుకొని తండ్రివైపు బలంగా విసిరేశాడు. బెడ్డ నేలకు తగిలి అదే విసురుతో వచ్చి బాలయ్య పక్కటెముకకు తగిలింది.

తండ్రి కొడుకుల తన్నులాట దొరకు మహదానందం కల్గించింది. నవ్వుకొంటూ కుర్చీలోంచి లేచి భుజంమీది కండువా సరి చేసుకొన్నాడు. వచ్చిన పనేదో పూర్తి చేసినట్లు అక్కడి నుండి కదిలాడు. ఈ తమాషా అంతా దొర అనుచరులకు మరింత సంతోషం కల్గించినట్లుంది. ఉషారుగా ఇనుప కుర్చీ మడిచి చంకలో పెట్టుకొని తండ్రి కొడుకులవైపు తిరిగి తిరిగి చూస్తూ దొర వెంట కదిలారు.



డాక్టర్ నుండి వెళ్లిపొమ్మని కబురొచ్చే వరకు అన్యమనస్కంగా పని చేసిన బాలయ్య కత్తుల్ని సర్దుకొని ఇంటికి బయల్దేరాడు. కల్లు మాట మనసులోకే రాలేదు. కాళ్లీడ్చుకొంటూ ఇంటికి చేరాడు. అప్పటికే బాలయ్య పెళ్లానికి కొడుకు ద్వారా ఈ కబురంతా అందింది. అయినా ఒక మాట మాట్లాడలేదు.

చవుడు డబ్బా పట్టుకొచ్చి. కాస్త చవుడు మొగుడి చేతిలో వేసి కాసిన్ని నీళ్లు పోసింది. తడిచవుడును బాలయ్య మోచేతుల వరకు రుద్దుకొన్నాక నీళ్ల డబ్బా ఎత్తి చేతుల మీద ధార పట్టింది. మొగుడు చేతులు శుభ్రం చేసుకొన్నాక అంగీ బనియన్ విప్పేయించి దెబ్బ తగిలిన చోట కాపడం పెట్టింది. కాపడం అయిపోగానే గబాగబా రెండు జొన్న రొట్టెలను పెనం మీద కాల్చి మడిచి తల్లెలో పెట్టి ముందుకు తోసింది. రొట్టెల మీద పల్చటి నీళ్ల చారు పోసి టీ స్పూన్‌తో మామిడి తొక్కు వేసింది.

దొర మాటలు, కొడుకు చేతలు తలచుకొంటూ అవమాన భారంతో కుంగిపోయిన బాలయ్య అతి కష్టంమీద ఒక రొట్టె తిని లేచి చేతులు కడుక్కొన్నాడు. గుక్కెడు నీళ్లు దాగి నులక మంచం మీదికి వెళ్లి కూర్చున్నాడు. జేబులోంచి బీడికట్ట తీసి ఒక బీడీ లాగి నోట్లో పెట్టుకొట్టుకొన్నాడు. తలగడ కింద నుండి అగ్గిపెట్టె తీసి పుల్ల గీశాడు. పుల్ల వెలగలేదు. రెండు మూడు సార్లు గీచి చూశాడు. అయినా వెలగలేదు. అగ్గిపెట్టె వైపు చూశాడు.. .కోపం నశాళానికి చేరుకొంది. సూరజ్ మార్కు అడిగితే ఆ బద్మాష్ గాడు బదక్ మార్కు ఇచ్చిండు అంటూ అగ్గిపెట్టెను కసిగా నేలపైకి విసిరికొట్టాడు. పెట్టెలోంచి జారిన పుల్లలు నేలంతా విరుచుకొని పడ్డాయి. నేలమీద చెల్లాచెదురుగా పడిన పుల్లల్ని చూసి కోపం చప్పున చల్లారినట్లయింది. వెలిగించని బీడిని పళ్లమధ్య నుండి తీసి మళ్లీ కట్టలో పెట్టాడు. కట్టను దిండు కింద పెట్టి మంచం మీదికి ఒరిగి పోయాడు. అలిసిన శరీరం ఐదు నిమిషాల్లోనే గురకలు మొదలెట్టింది. చేయని పాపానికి బలైనట్లుగా నేలమీద చెల్లా చెదురుగా పడిపోయిన అగ్గిపుల్లలు తెల్లారేదాకా అలాగే ఉండిపోయాయి.

✦

లెక్కించండి?

5	40	8
30		24
6	?	3

పిల్లలూ మీకు లెక్కలు చేయడమంటే భలే సరదా కదా. అయితే ఈ చిన్ని పజిల్‌ను పూర్తి చేయండి

చుక్కలు కలపండి



బుజ్జి స్టార్

ఈ ఫొటోలో వున్న బాలనటి ఎవరో చెప్పుకోండి. ఇప్పుడు హీరోయిన్ అనుకోండి.



ఆకులతో కోడిపుంజు

ఆకులు ఏరుకొచ్చి చక్కగా కోడిపుంజు ఆకారంలో అతికించేశాడు చింటూ, మరి మీరూ ఇలానే చేస్తారు కదూ.

పదాలు పూరించండి

తెలుగు పదాల ఆధారంగా ఇంగ్లీషు పదాలు పూర్తిచేయండి

ఆధారాలు					
నవారు	R	I	BB	O	N
కుందేలు	R	A	BB	I	T
చెరిపే సాధనం			BB		
అల్లరి మూక			BB		
గులకరాయి			BB		
దొంగ			BB		
వచ్చీరాని మాటలాడు			BB		
నీటిబుడగ			BB		



ఎన్ని జంతువులున్నాయి?

ఈ చిత్రంలో మొత్తం ఎన్ని జంతువులు,దుంపలు దాగి ఉన్నాయి? అవి ఎక్కడ ఉన్నాయి? వాటి పేర్లు తెలపండి?

జవాబులు బుజ్జిస్టార్: త్రిష, **లెక్కించండి:** 18, **ఎన్ని జంతువులున్నాయి:** కప్ప,ముల్లంగి, బీట్ రూట్, పాము, క్యారెట్, చేప,పక్షి, ఎలుక,బీటిల్ కీటకం **పదాలు పూరించండి :** rubber, sobber, pebble, robber, jabber, bubble



పులి తల్లి – పంది పిల్లలు

పులి మీద ఎంచక్కా నిద్రపోతున్న బుజ్జి బుజ్జి పందిపిల్లలు. పులి మీసాలతో ఆడుకుంటున్న పందిపిల్లలు. నమ్మబుద్ధి కావడం లేదు కదూ. అయితే కాలిఫోర్నియా జూలో ఈ మధ్యే జరిగిన ఓ విషయం గురించి చెప్పుకోవాలి. ఇదిగో ఈ బొమ్మల్లో కనిపిస్తున్న పులికి ఇటీవల పిల్లలు పుట్టాయి. కాకపోతే ఆరోగ్య సమస్య వల్ల అవి వెంటనే చనిపోయాయి. పిల్లలను కోల్పోయిన తల్లికి బాధ వుంటుంది కదా. అదే జరిగింది. ఆ దిగులుతో దాని ఆరోగ్యం రోజు రోజుకూ పాడైపోసాగింది. అలాగే వదిలేస్తే పులి కూడా దక్కదనుకున్నారు జూ అధికారులు. ఏదో ఒకటి చేసి తల్లిని కాపాడుకోవాలనుకున్నారు. వాళ్లకు మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. అప్పుడే పుట్టిన అయిదు పంది పిల్లలను తీసుకొచ్చి... పులి చర్మం చుట్టి ... పులి దగ్గర వదిలారు. వాటినే తన పిల్లలనుకుని చాలా సంతోషపడిపోయిందా తల్లి. మెల్లగా దాని ఆరోగ్యం కూడా కుదుట పడుతోందట.

ఇంత వరకు బానే వున్నా... రేపు ఆ బుజ్జి వరాహాలు తన పిల్లలు కాదని పసిగడితేనే సమస్య అవుతుంది. అంత దాకా రాకుండా అధికారులు జాగ్రత్త పడతారనే అనుకుందాం.

నీడను గుర్తించండి



అగ్రనేత అనుభవాల దర్పణం

మాకినేని బసవపున్నయ్య కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత మాత్రమే గాక సిద్ధాంత కోవిదుడుగా ప్రథమ స్థానం పొందిన వ్యక్తి. ఉగ్రూతలూపే ఉపన్యాసకుడుగానూ, సైద్ధాంతికాంశాల లోతుపాతులు మథించే మేధాసంపన్నుడుగానూ ఎనలేని సేవలందించిన మహానేత. దాదాపు అరవై ఏళ్ల తన రాజకీయ జీవితంలో అత్యున్నత బాధ్యతలు నిర్వహించి ఎన్నెన్నో మహత్తర రచనలు చేసిన ఎంబి స్వంత జీవిత గమనం గురించి మాత్రం అర పేజీ కూడా రాసుకోకపోవడం ఆసక్తికరమైన విషయం. ఏవైనా ఇంటర్వ్యూలలో అరుదైన ప్రస్తావనలు తప్ప ఆయన వ్యక్తిగత జీవితగమనం గురించి ఎక్కడా గ్రంథస్తం చేయలేదు. అలాగే ఇంతటి నిశిత పరిశీలనా శక్తిగల మేధావిగా ఉద్యమ గమనాన్ని గురించిన ప్రత్యక్షానుభవాలనూ ఒక్క ముఖంగా అందించిన సందర్భం లేదు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'నా జ్ఞాపకాలు' ఆ లోటు తీర్చేందుకు ఉపయోగపడుతుంది. 1977-78లో ఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయంలో యువ కార్యకర్తలు రికార్డు చేసిన ఇంటర్వ్యూ పూర్తి పాఠమే దాదాపు 140 పేజీల ఈ పుస్తకం. మొత్తం 13 అధ్యాయాలుగా ప్రశ్న జవాబు రూపంలో వున్న 'నా జ్ఞాపకాలు' తెలంగాణ సాయుధ పోరాట విరమణ వరకూ స్పృశిస్తుంది. ధనిక రైతు కుటుంబంలోపుట్టిన ఎంబీకి ఏడెనిమిదేళ్ల వయస్సు వచ్చేసరికి గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర పోరాటం ఉధృతమైన ప్రభావం చూపిస్తున్నది. భగత్ సింగ్ ఉరితీత, కల్లు వ్యతిరేక పోరాటం తదితర ఘటనలు చాలా ప్రభావం చూపించాయి. గుంటూరు జిల్లా ఎసి కాలేజీలో చదివిన ఎంబి ఆ నేపథ్యంలోనే ఆయన విద్యార్థి నాయకుడుగా విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జీవితం ప్రారంభించారు. కృష్ణా



నా జ్ఞాపకాలు, కామ్రేడ్ ఎం. బసవపున్నయ్యతో ఇంటర్వ్యూ
పేజీలు: 144,
ధర: రు. 60,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవ తెలంగాణా పబ్లిషింగ్ హౌస్.

గోదావరి డెల్టా ప్రాంతం కాంగ్రెస్ ఉద్యమం, తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం అభ్యుదయ ఉద్యమం. జస్టిస్ పార్టీ, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం అన్నిటిలోనూ కీలక పాత్ర వహించడానికి దారి తీసిన కారణాలను తన సమాధానాలలో ఎంబి వివరిస్తారు. తరచూ ప్రస్తావనకు వచ్చే కుల కోణాలను అంటే బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ కులాల నాయకత్వ పాత్రలలో మార్పులు చేర్పులను సాధారణ పరిభాషలో చెప్తారు ఎంబి. కాంగ్రెస్ నాయకుడైన పట్టాభి సీతారామయ్య పార్టీ అధ్యక్ష ఎన్నికలలో నీలం సంజీవరెడ్డిని ముందుకు తెచ్చినప్పటి నుంచి ఇవి తీవ్రమైన తీరును కూడా ప్రస్తావించారు. 1934లో కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల ఏర్పాటును గురించి చెప్పారు. ఈ దశలో తమ వెంట వున్న ఆచార్య రంగా వాస్తవానికి సైద్ధాంతిక అంశాలలో అంత అవగాహన లేని వ్యక్తిగా నిరూపించుకున్నాడని అనుభవాలతో చెప్పారు. ఉత్తరోత్తరా ఆయన ఒక కుల నాయకుడుగానే మిగిలిపోగా కమ్యూనిస్టులు శ్రమ జీవులను కదిలించి నూతన చైతన్యం రగిలించారు. నాటి ఆంధ్రలో ఆధునిక కార్మిక వర్గం పెద్దగా పెంపొంద లేదు గనక లాగుడు బళ్లవాళ్లు, దర్జీలు, రైల్వే పోర్టర్ల వంటివారితోనే సంఘాలు నిర్మించాల్సి వచ్చిందంటారు. ఇక వ్యవసాయ కార్మిక సంఘాలకు శ్రీకారం చుట్టారు. ఈ తరగతులలోకి అంతవరకూ వెళ్లిన వారు లేరు కనుకనే స్పందించి వచ్చిన కమ్యూనిస్టులను వారూ ఆదరించారు. ఈ క్రమంలో రెండవ ప్రపంచ యుద్ధం, క్విట్ ఇండియా ఉద్యమంపట్ల కమ్యూనిస్టుల వైఖరి వంటి క్లిష్ట సందర్భాలను కూడా తడిమారు. చివరగా 1946లో వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితులు, దానిపై అణచివేత వంటివి వివరించారు. దాని కొనసాగింపునకు సంబంధి ంచిన అంశాలపై తుది నిర్ణయానికి సోవియట్ అధినేత స్టాలిన్‌ను కలుసుకోవడానికి వెళ్లిన ముగ్గురిలో ఎంబి ఒకరు. వివిధ తరగతుల నుంచి తీవ్ర విషప్రచారానికి గురైన స్టాలిన్ వాస్తవంలో తమతో ఎంత నమ్రతగా వాస్తవికంగా ప్రవర్తించారో ఎంబి కళ్లకు కట్టినట్టు చెప్పారు. ఈ పుస్తకంలో బాగా ఆసక్తి కలిగించే చివరి భాగమిది. మధ్య మధ్య సమకాలీన సందర్భాలను కూడా ప్రస్తావిస్తూ కమ్యూని స్టుల విశిష్టతను చెప్పడం సమంజసంగా వుంది. ఎంబి సుదీర్ఘ విప్లవ జీవితంతోపోలిస్తే ఈ చిన్న పుస్తకం అనిపించినా ముఖాముఖి చెప్పినందువల్ల గొప్ప ప్రాధాన్యత సంతరించు కుంది. ఎ.సత్యరంజన్ అనువాదం సాఫీగా సాగుతుంది.

- తెర

పరిష్కారాన్ని వెతకటంలో తడబడిన

'కలల రాజ్యం'

సమాజంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు వాటి పరిష్కారాల పట్ల చాలా మందికి రకరకాల అభిప్రాయాలున్నాయి. రచయితలు కూడా అందులో భాగమే. మహిళలపై నిత్యం జరుగుతున్న అత్యాచారాలు, అవినీతి, అక్రమ సంపాదన, వేశ్య వృత్తి, సారా వ్యసనం లాంటి సమస్యలకు పరిష్కారం వెతికే సంవేదనే ఈ "కలల రాజ్యం" డైరెక్ట్ నవల టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి రాసిన ఈ నవల పాత కాలపు డిటెక్టివ్ నవలలను గుర్తుచేస్తోంది. చివరి వరకూ టెంపోతో సాగిపోయే కథనం ఆకట్టుకుంది. ప్రేమతో మొదలయిన కథ పగతో ముగుస్తుంది. అయితే ఈ పగ మానవ సమాజంలోని చెడులపై.. ఈ పగ మానవ సమాజంలోని రుగ్మతలపై .. వాటికి పరిష్కారం వెతికే క్రమం స్టాలిన్ సినిమాలోని సేనలాగా ఇక్కడ ఎం.ధర్మరాజు వ్యక్తి సంహారం ప్రారంభిస్తాడు. కలల రాజ్యంలోని కథ ఇది. ఉదయ్‌బాబు కథానాయకుడు. అతని ప్రేమ పండే సమయంలో ఎయిడ్స్ సోకినట్లు అర్థమవుతుంది. అతనిని పరీక్షించిన డాక్టర్ ప్రభావంతో చావుకు ముందు సమాజానికి ఉపయోగపడే పనిని చేయాలని నిర్ణయించుకుంటాడు. "యామ్యదిక్పతి" పేరుతో ముందుగా చంపదల్చుకున్న వారికి ఉత్తరం రాసి చంపిన తరువాత కలల రాజ్యం అనే అట్టముక్క వదిలి వెళతాడు. అత్యాచారం చేసిన రామకృష్ణను, ప్రజలను వైద్యం ద్వారా దోచుకుంటున్న డాక్టర్ రాజశేఖర్ తాగుడుకు బానిసై యాక్సిడెంట్‌లు చేస్తున్న డ్రైవర్ జాన్‌ను, వేశ్యావృత్తిలో ఉన్న "చంపకా"న్ని ఒకే పద్ధతిలో చంపేస్తాడు. ఒక గ్రామంలో ప్రజల (పిచ్చి) డాక్టర్ ప్రోత్సాహంతో చావుకు దగ్గరైన "ఉదయ్ బాబు" ఈ పని చేస్తాడు. పోలీసులు, ప్రజలు హర్షించారు. ఇదీ కథ. వ్యక్తులను చంపితే సమస్య పరిష్కారమవుతుందా? అనేది ఒక ప్రశ్నయితే అసలు దోపిడిదార్లను ప్రజా కంఠకులను వదిలి చిల్లర వ్యక్తులను మట్టుబెడితే ప్రయోజనమేమిటనేది రెండవ ప్రశ్న. వీటికి ఇక్కడ సమాధానాలు వెతకటం అనవసరం. మంచి డిటెక్టివ్ నవల చదివినట్లు ఈ నవలను చదవచ్చు. రచయిత కథనాశైలి పాఠకుణ్ణి చివరి వరకూ చదివిస్తుంది.

-భవిష్య

నిజమైన అందం

యాంజెలికా ముగ్గురు ఆడ పిల్లల తల్లి. 27 ఏళ్ల నల్లజాతీయురాలైన ఆమె తన చిన్నారుల కోసం రకరకాల బొమ్మల్ని కొనిచ్చేది. ఓ రోజు చిన్న కూతురు వచ్చి తన జుట్టు బాలేదు.. బొమ్మకు ఉన్నట్టు స్ట్రయిట్ చేయాలని అడిగింది. మరో రోజు తను బొమ్మలా తెల్లగా లేనని దిగాలు పడింది. సహజ సౌందర్యాన్ని అభిమానించకుండా ఈ బొమ్మలు పిల్లల మనస్సులో విష బీజాలు నాటుతున్నాయని గమనించిన యాంజెలికా ఓ గొప్ప ప్రాజెక్ట్ మొదలెట్టింది. నీగ్రోల ముఖ కవళికల అందాన్ని ప్రతిబింబించేలా పెద్ద పెదాలు, మెలికలు తిరిగే జుట్టు, గోధుమ రంగు కళ్లు, నల్లటి చర్మం కలిగి చాలా ఆకర్షణీయంగా ఉండే దుస్తుల్లో ఓ బొమ్మను రూపొందించింది. అది పిల్లలకు బాగా నచ్చేసింది. తమకు లాగే బొమ్మ ఫీచర్స్ కూడా ఉండటంతో తమలో లేని లోపాల్ని వెతకడం ఆపేశారు. తమ అందాన్ని గుర్తించడం, సహజత్వాన్ని ప్రేమించడం నేర్చుకున్నారు. ఎనిమిది నెలలు కష్టపడి నీగ్రోల సంప్రదాయ వస్త్రాలు, కేశాలంకరణకు అనుగుణంగా ముస్తాబు చేయగలిగే విధంగా బొమ్మ మోడల్‌ను తయారుచేసింది. ఇదే స్ఫూర్తిగా ఆమె భారీ ఎత్తున 'నాచురల్లీ పర్‌ఫెక్ట్ డాల్స్' శ్రేణిలో 'యాంజెలికా' పేరిట బొమ్మల్ని ఉత్పత్తి చేసే పనిలో పడింది. కేవలం తమ జాతి వారే కాకుండా రకరకాల వర్ణాల్లో ఉండే జాతుల వారి సహజత్వానికి దగ్గరగా బొమ్మల్ని రూపొందించేందుకు ప్రయత్నిస్తోంది. ఆమె ప్రాజెక్ట్‌కు చాలా మంది నుంచి మద్దతు లభిస్తోంది. విరాళాల రూపంలో సాయమందించి ఆమె ప్రయత్నం కార్యరూపం దాల్చేలా చేయూతనిస్తున్నారు. పిల్లలు తమను తమ రూపాల్లో ఇష్టపడేలా చేసే ఈ బొమ్మలు పెద్ద మార్పే తెస్తాయని మానసిక విశ్లేషకులు అంటున్నారు. బార్బీ బొమ్మల్ని చూసి వాటిలా మారేందుకు ప్రాణాల మీదకు కొనితెచ్చుకున్న వారితో పాటు అందానికి కొలతలతో మతులు చెడగొట్టుకుంటున్నవారికి ఈ బొమ్మల ద్వారా వివేకం కలిగే అవకాశముంది.

రైతు అభ్యున్నతి కొరకై.... నిరంతర అన్వేషణే జైన్ ఇరిగేషన్ కంపెనీ లక్ష్యం.

తక్కువ నీటితో ఎక్కువ పంటలు

గత 50 సంవత్సరములుగా సాగునీటి పారుదలలో అత్యధిక నీటివినియోగ సామర్థ్యము కొరకు ఉపయోగపడు పరికరములు కనుగొనుటకు, అలుపెరుగని శ్రమతో ప్రయత్నము చేయుచున్న జైన్ ఇరిగేషన్‌కంపెనీ, ప్రపంచ రైతాంగపు ఆర్థిక హొడుదుడుకులను అధిగమించుటకు అందిస్తున్న అతి విశిష్టమైన వస్తువే జైన్ టర్బోస్లిమ్ లేటరల్.... అతి తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో, అధికపంటతో అధిక లాభాలు పొందు అవకాశము కలది 'జైన్ టర్బోస్లిమ్ లేటరల్' తక్కువ మందముకలిగిన నాణ్యమైన లేటరల్‌పైపు. ఈ లేటరల్ పైపు అంతర్జాతీయ ప్రమాణములతో తయారు చేయబడి ప్రంచములోని అగ్రగామి దేశాలలో విరివిగా ఉపయోగింపబడుచున్నది. దీని ధర తక్కువ కావున ఎక్కువ విస్తీర్ణముగల రైతులకు ఆర్థికముగా ఎంతో వెసులుబాటు కలుగును. నాణ్యతలో ఎలాంటి మార్పులేదు. ఈ లేటర్ జాగ్రత్తగా వాడుకొన్నచో షుమారుగా 2-3 సంవత్సరములు పనిచేయును.

- 'జైన్ టర్బోస్లిమ్' సాధారణముగా 16 మి.మీ (5/8 అంగుళములు) సైజులో 6,8,10,12,15 (మిల్) మందములలో లభ్యమగును.
- 'జైన్ టర్బోస్లిమ్' నేలపైన మరియు నేలలోపల అమర్చుటకు అనువైనది.
- మొత్తం విస్తీర్ణమునకు సబ్సిడీ లభ్యముకాదు. అట్టి రైతులు ఈ తక్కువ ధర లేటరల్‌తో వారి మొత్తము విస్తీర్ణమలో డ్రిప్ అమర్చుకొనుటకు వీలుకలుగును. ఈ టర్బోస్లిమ్ లేటరల్ పైపులు, సబ్సిడీలో లభించు లేటరల్ పైపుల కన్నా చాలా తక్కువ ధరలో లభించు లేటరల్ పైపులకన్నా చాలా తక్కువ ధరలో లభించుటచే రైతులు సులువుగా భరించగలరు.

జైన్ ®

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, గాంధీనగర్, హైదరాబాద్ - 80,
ఫోన్ : 040-2761 4474, 24654681, 9440797846.
Email : jainhyderabad@jains.com,
Website : www.jains.com

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

ప్యారిస్ సఫారీ



ఫ్యాషన్ రాజధాని ప్యారిస్‌లో పగళ్లు ఎన్ని ఫ్యాషన్లను అరబెడుతున్నాయో తెలీదు కానీ రాత్రుళ్లు మాత్రం ఓ సరికొత్త ఫ్యాషన్ స్వప్నం కళ్లు నులుముకుంటోంది. రకరకాల జంతువులు ఫ్యాషన్ దుస్తుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ప్యారిస్‌లో జంతువులకూ ఫ్యాషన్ పిచ్చి పట్టిందనుకుంటే పొరపాటే. పారిస్ వాసుల అసలు నైజాల్ని వారి దుస్తుల్లో ప్రదర్శించే వ్యక్తిత్వాలను ప్రతిబింబిస్తూ తన కళను ప్రాజెక్ట్ చేస్తున్నాడు జులియన్ నొన్నొన్. ప్యారిస్ వీధుల్లోని భారీ బిల్డింగ్‌లు, కార్నర్‌లు, గోడలు, కట్టడాలపై భారీ పరిమాణంలో ఉన్న ఫ్యాషన్ డ్రెస్సులు వేసుకున్న జంతువుల బొమ్మల్ని వీడియో మ్యాపింగ్ చేస్తున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన విజువల్ ఆర్టిస్ట్ అయిన జులియన్ 'అర్బన్ సఫారీ' పేరిట నగరజీవుల దర్పాల్ని, కుంచితత్వాల్ని వీధికెక్కించాడు. ఎల్‌ఈ3 స్టూడియో వ్యవస్థాపకుల్లో ఒకడైన జులియన్ కైనెటిక్ ఇన్‌స్టాలేషన్స్, డిజిటల్ క్రియేషన్స్, వీడియో మ్యాపింగ్‌ను ఉపయోగించే ఎంబెడెడ్ వీడియో ప్రాజెక్షన్ వ్యవస్థ ద్వారా ప్యారిస్ రాత్రులను మెరిపిస్తున్నాడు.

టాల్ పాలెజ్